# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 161 | హైదరాబాద్ | మంగళవారం 16-12-2025 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

'నో హెల్మెట్ - నో పెట్రోల్' నిబంధనను తీసుకురావడం మంచి ఆలోచన: సీఎం

## ఢిల్లీని కమ్మేసిన
# దట్టమైన పొగమంచు..

- ‘తీవ్ర’ స్థాయికి చేరిన వాయు నాణ్యత సూచీ
- వంద విమానాల రద్దు.. 300కి పైగా ఆలస్యం
- పలు రైళ్లు 6 నుంచి 7 గంటల పాటు ఆలస్యంగా నడుస్తున్నవైనం
- నిర్మాణాలపై నిషేధం, ఆఫీసులకు వర్క్ ఫ్రమ్ హోమ్
- ఢిల్లీకి ‘ఆరెంజ్’ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ


11లో

## రవీంద్ర భారతి ప్రాంగణంలో
# ఎస్పీ బాలు విగ్రహావిష్కరణ

- విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- కార్యక్రమానికి హాజరైన బండారు దత్తాత్రేయ, శ్రీధర్ బాబు, రామచందర్ రావు
- తూర్పు గోదావరి జిల్లాలో ప్రత్యేకంగా తయారు చేయించిన 7.2 అడుగుల విగ్రహం


11లో

## ముంబైలో ఇద్దరు టెర్రరిస్టులను అరెస్టు చేసిన
# పంజాబ్ పోలీసులు

- గ్యాంగ్‌స్టర్ నుంచి ఉగ్రవాదులుగా మారిన ఇద్దరు అరెస్టు
- సాజన్ మాసిహ్, సుఖ్‌దేవ్ కుమార్‌గా గుర్తింపు
- నిషేధిత ఉగ్రవాద సంస్థతో సంబంధం ఉన్నట్లు డీజీపీ వెల్లడి


11లో


11లో

## శబరిమలకు
# పోటెత్తిన భక్తులు..

### 25 లక్షలు దాటిన యాత్రికుల సంఖ్య

- ఈ మండల యాత్రా సీజన్‌లో 25 లక్షలు దాటిన శబరిమల యాత్రికుల సంఖ్య
- గతేడాది ఇదే సమయానికి 21 లక్షల మంది భక్తుల దర్శనం
- వర్చువల్ క్యూ తేదీలు పాటించకపోవడంతోనే మొదట్లో రద్దీ
- ఈ నెల 27న మండల పూజతో తొలి దశ యాత్ర ముగింపు

## జోర్డాన్..
# చేరుకున్న ప్రధాని మోదీ


- మూడు దేశాల పర్యటనలో భాగంగా జోర్డాన్ చేరుకున్న ప్రధాని మోదీ
- విమానాశ్రయంలో ప్రధానికి స్వయంగా స్వాగతం పలికిన జోర్డాన్ ప్రధాని
- ఇరు దేశాల దౌత్య సంబంధాలకు 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటన


11లో

## ఏపీలో హార్ట్‌ఫుల్‌నెస్ విస్తరణ..
# దాజీతో సమాలోచనలు జరిపిన సీఎం

- రంగారెడ్డి జిల్లా చేగూరులోని కన్హా శాంతి వనాన్ని సందర్శించిన చంద్రబాబు
- శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు దాజీతో ప్రత్యేకంగా సమావేశం
- ఏపీలో హార్ట్‌ఫుల్‌నెస్ కార్యాలయం ఏర్పాటుపై కీలక చర్చలు


11లో



# చైనా పార్టులు వద్దు..
## రూ.5,000 కోట్లతో
## స్వదేశీ డ్రోన్ల కొనుగోలుకు ఆర్మీ సిద్ధం

- భారీగా దేశీయ డ్రోన్లను సమకూర్చుకోనున్న సైన్యం
- కామికేజ్, నిఘా, సుదూర లక్ష్య ఛేదన డ్రోన్ల సమీకరణ
- జామింగ్, స్పూఫింగ్‌ను తట్టుకునేలా ప్రత్యేక ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సామర్థ్యం


11లో

భారత శక్తి
VOICE OF INDIAN

# ఇండియా వైపు అమెరికన్ కంపెనీలు

ఒకప్పుడు అమెరికా కంపెనీలు భారతదేశంలో పెట్టుబడి పెట్టడానికి అంతగా ఆసక్తిని చూపించేవి కాదు. ఒకవేళ పెట్టుబడులు పెట్టినప్పటికీ అనేక రకాల షరతులతో ఇక్కడికి వచ్చేవి. మనదేశంలో స్థిరమైన ప్రభుత్వాలు ఏర్పడకపోవడం వల్ల విదేశీ పెట్టుబడిదారులలో నమ్మకం ఉండేది కాదు. దీంతో కంపెనీలు ఏర్పాటు కాకపోవడంతో దేశానికి అంతగా ఆదాయం ఉండేది కాదు. 2014 నుంచి ఇప్పటివరకు దేశంలో స్థిరమైన ప్రభుత్వాలు ఏర్పడటం వల్ల పెట్టుబడిదారుల్లో నమ్మకం కలిగింది. దీనికి తోడు ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలు కంపెనీలకు అనుకూలంగా ఉంటున్నాయి. ముఖ్యంగా అమెరికన్ కంపెనీలు భారతదేశంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయి. అమెరికన్ కంపెనీలు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడం ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ కు ఏ మాత్రం ఇష్టం లేదు. అందువల్లే భారత్ మీద నిత్యం చిమ్ముతూనే ఉన్నాడు. భారతదేశంలో పెట్టుబడులు పెట్టకుండా అమెరికా కంపెనీలను నియంత్రించడానికి ప్రయత్నిస్తున్నాడు. 145 కోట్ల వినియోగదారుల మార్కెట్ ఉన్న భారతదేశంలో పెట్టుబడులు పెట్టకపోతే తమకు లాభాలు రావని అమెరికన్ కంపెనీలు భావించి.. మనదేశంలో భారీగా పెట్టుబడి పెడుతున్నాయి. మైక్రోసాఫ్ట్ నుంచి మొదలు పెడితే అమెజాన్ వరకు అన్ని కంపెనీలు భారతదేశానికి క్యూ కడుతున్నాయి. అమెజాన్ ఇప్పటికే భారత దేశంలో విస్తృతంగా వ్యాపార కార్యకలాపాలు సాగిస్తోంది.. మరో మూడు లక్షల కోట్ల పెట్టుబడి పెట్టడానికి ఆ కంపెనీ ముందుకు వచ్చింది. మైక్రోసాఫ్ట్ కూడా 1,50,000 కోట్లతో పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చింది. గూగుల్ కూడా అత్యంత విలువైన డాటా సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. భవిష్యత్తు కాలంలో ఇంకా ఎక్కువ స్థాయిలో కార్యకలాపాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని గూగుల్ ప్రకటించింది.. వాస్తవానికి ఈ మూడు సంస్థలు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి ముందు.. ఆ కంపెనీ ప్రతినిధులను ట్రంప్ కలిశాడు.. మనదేశంలో పెట్టుబడులు పెట్టకుండా నిలిపివేయడానికి ప్రయత్నించాడు. కానీ ఆ కంపెనీలు ఏమాత్రం అందుకు ఒప్పుకోలేదు. అమెరికన్ కంపెనీలు భారతదేశంలోకి విపరీతంగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో ట్రంప్ ఏమాత్రం సహించలేకపోతున్నాడు. భారతదేశం మీద ఏదో ఒక రకంగా విమర్శలు చేస్తూనే ఉన్నాడు.. అమెరికన్ కంపెనీలను తీవ్రస్థాయిలో తప్పుపడుతున్న ట్రంప్.. తన రియల్ ఎస్టేట్ కంపెనీ ద్వారా ఇండియాలోనే పెట్టుబడులు పెడుతుండడం విశేషం. ఇప్పటికే హైదరాబాదులో ట్రంప్ టవర్స్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని మొదలుపెట్టాడు అమెరికా అధ్యక్షుడు. భవిష్యత్ కాలంలో తన వ్యాపారాన్ని ఇంకా పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. కానీ అమెరికన్ కంపెనీలను మాత్రం నిలువరిస్తున్నాడు. ట్రంప్ కు షాక్ ఇస్తూ అమెరికన్ కంపెనీలు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడం వల్ల.. ఆర్థిక రంగం సమూల మార్పులకు గురవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం భారత్ ప్రపంచ ఆర్థిక శక్తులలో నాలుగో స్థానంలో ఉంది. ఇదే స్థాయిలో అమెరికన్ కంపెనీలు పెట్టుబడులు పెడితే నాలుగో స్థానం నుంచి మూడో స్థానానికి చేరుకునే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఒకప్పుడు చైనా సహాయంతో రష్యా స్థానాన్ని అమెరికా లాగేసుకుందని.. అయితే ఇప్పుడు చైనా ను అమెరికా నమ్మదని.. అమెరికాను కూడా చైనా నమ్మదని ఆర్థిక విశ్లేషకులు అంటున్నారు.. పైగా చైనాలో తన పెట్టుబడులను వెనక్కి తీసుకోవడానికి అమెరికా ఇష్టపడదని.. చైనాలో నియంతృత్వ ప్రభుత్వం ఉండడంతో అమెరికా కంపెనీలు ప్రత్యామ్నాయంగా భారత్ వైపు చూస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. పైగా భారత దేశంలో 145 కోట్ల జనాభా ఉన్న నేపథ్యంలో అమెరికన్ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెడుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. మరో వైపు మెరికా భారతదేశంపై వాణిజ్య ఒత్తిడి పెడుతున్నప్పటికీ, దాని సొంత ఆర్థిక?సాంకేతిక క్షేత్రాలు నష్టపోతున్నాయి. ట్రంప్ విదేశాంగ విధానం విఫలమనే ఆరోపణలు ఎదుగుతున్నాయి. భారత్‌తో పోలిస్తే, ఇజ్రాయెల్, రష్యా, గూగుల్ వంటి శక్తులు భారత్‌తో భాగస్వామ్యాలు పెంచుతున్నాయి. భారత్‌పై అదనపు సుంకాలు విధించి, వ్యవసాయ ఎగుమతులను (ముఖ్యంగా బియ్యం) నిరోధించాలని అమెరికా ప్రయత్నిస్తోంది. ఈ చర్యలు అక్కడి రైతులను కూడా ఆగ్రహపరుస్తున్నాయి. పాకిస్తాన్‌తో సన్నిహితత్వం కలిగి ఉండటం వల్ల ట్రంప్ విదేశ విధానం ప్రశ్నార్థకమవుతోంది, దీనికి నోబెల్ బహుమతి వ్యామోహం కూడా కారణంగా చెబుతున్నారు. గూగుల్ 2029 నాటికి భారత్‌లో 70 మిలియన్ డాలర్ల పెట్టుబడితో డేటా సెంటర్ నిర్మిస్తానని ప్రకటించింది. భారత్ డేటా సెంటర్ల ర్యాంకింగ్‌లో 14వ స్థానంలో ఉంది, అమెరికా, రష్యా, చైనా ముందున్నాయి. ఆసియా నిపుణులపై అమెరికా పరిమితులు వల్ల భారతీయులు కెనడా, ఆస్ట్రేలియా, యూకే వైపు మళ్లుతున్నారు. మైక్రోసాఫ్ట్ కూడా ఇలాంటి ప్రణాళికలు ప్రకటించింది, దీనివల్ల భారత్‌లో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. ఇజ్రాయెల్ భారత్‌తో రక్షణ ఒప్పందం కుదుర్చుకుంది. దేశంలోనే ఆయుధాల తయారీకి ముందుకు వచ్చింది. స్థానిక సంస్థలతో కలిసి ఈ ప్రాజెక్టులు అమలు చేస్తారు, దీనివల్ల పాకిస్తాన్, టర్కీలకు షాక్ ఇచ్చారు. అమెరికా ఈ అభివృద్ధిని ఎలా తీసుకుంటుందనే ఆందోళన పెరిగింది. రష్యా కూడా ఆయుధ తయారీలో భారత్‌తో సహకారం పెంచుతోంది. అమెరికా పాకిస్తాన్‌తో క్రిటికల్ మినరల్స్ ఒప్పందం చేసుకుంది, గనుల నుంచి వనరులు త్వరగా వెలికితీయాలని ప్రణాళికిస్తోంది. భారత్‌పై టారిఫ్‌లు వేస్తున్నప్పుడు, పాకిస్తాన్‌లో పెట్టుబడులు పెంచడం వివాదాస్పదంగా మారింది.

# జగన్‌కు దూరమవుతున్న ఫ్యామిలీలు

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి,డిసెంబర్ 15:

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి మంచి పట్టున్న పొలిటికల్ ఫ్యామిలీలు జగన్ వెంట నడిచాయి. ముఖ్యంగా రాజశేఖర్ రెడ్డి తో ఉన్న అనుబంధం, ఆపై సామాజిక వర్గ ప్రభావంతో చాలామంది నేతలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించారు. ప్రధానంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో మేకపాటి రాజమోహన్ రెడ్డి, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, కేతిరెడ్డి ఫ్యామిలీ.. వంటి సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉన్న కుటుంబాలు జగన్ వెంట నడిచాయి. అయితే పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఫ్యామిలీలకు ప్రాధాన్యత తగ్గింది. సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డి, వై వి సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి లాంటి నేతలకు మాత్రమే జగన్మోహన్ రెడ్డి ప్రాధాన్యమిచ్చారు. ఆర్థికంగా కూడా చేయూతను అందించారు. అందుకే ఆది నుంచి జగన్ వెంట నడుస్తున్న ఫ్యామిలీలు దూరమైనట్టు కనిపిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పొలిటికల్ ఫ్యామిలీల అండ ఎక్కువ. శ్రీకాకుళం(నుంచి అనంతపురం వరకు కాంగ్రెస్ పార్టీలో ఒక వెలుగు వెలిగిన కుటుంబాలన్నీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నాయి. అయితే రాజశేఖర్ రెడ్డి మాదిరిగా జగన్ వద్ద వారికి అనుకున్నంత ప్రాధాన్యం లేదు. ఆ బాధతోనే చాలామంది ప్రత్యామ్నాయం లేక పార్టీలోనే కొనసాగుతూ సైలెంట్ గా ఉన్నారు. జగన్మోహన్ రెడ్డికి చెబితే వినరు.. తమ విషయంలో అస్సలు ప్రాధాన్యం ఇవ్వరు అన్న బాధ వారిలో ఉంది. ఆ కారణంతోనే సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు చాలా రోజులు పార్టీకి దూరంగా ఉండిపోయారు. ఫలితాలు వచ్చిన తర్వాత పూర్తిగా సైలెంట్ అయిన ఆయన ఇటీవల మళ్ళీ యాక్టివ్ అయ్యారు. జగన్మోహన్ రెడ్డి తీసుకునే నిర్ణయాలు, ఆయన వ్యవహార శైలి చాలామంది సీనియర్లకు రుచించడం లేదు. తాము జగన్మోహన్ రెడ్డి కోసం త్యాగం చేస్తే.. తమ త్యాగాలను అస్సలు పట్టించుకోవడం లేదన్న బాధ చాలామంది సీనియర్లలో ఉంది. నెల్లూరు జిల్లాకు చెందిన మేకపాటి రాజమోహన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి కి సమకాలీకుడు. అందుకే జగన్మోహన్ రెడ్డికి అండగా నిలవాలని భావించారు. తన ఫ్యామిలీతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాజమోహన్ రెడ్డితో పాటు ఆయన సోదరుడు చంద్రశేఖర్ రెడ్డి, కుమారులు గౌతంరెడ్డి, విక్రమ్ రెడ్డి అంతా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం గట్టిగానే పని చేశారు. అయితే గౌతమ్ రెడ్డి మరణం తర్వాత ఆ కుటుంబానికి క్రమేపి ప్రాధాన్యం తగ్గింది. రాజమోహన్ రెడ్డి సూచనలను జగన్మోహన్ రెడ్డి పట్టించుకోవడం మానేశారు. దీంతో ఆయన తీవ్ర మనస్థాపంతో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. పార్టీలో ఉండడం వేస్ట్ అన్నట్టు ఒక నిర్ణయానికి వచ్చినట్లు టాక్ నడుస్తోంది. తీవ్ర నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. జగన్మోహన్ రెడ్డికి అత్యంత విధేయత కలిగిన కుటుంబం ఆళ్ళ కుటుంబం. స్వతహాగా పారిశ్రామికవేత్త అయిన ఆళ్ల అయోధ్య రామిరెడ్డిజగన్ వెంటే అడుగులు వేశారు. ఆయన సోదరుడు ఆళ్ళ రామకృష్ణారెడ్డి సైతం జగన్మోహన్ రెడ్డి కోసం, ఆయన నాయకత్వం బలపరిచేందుకు,



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు ఆరాటపడ్డారు. ఎంతగానో కృషి చేశారు. అయితే వారి కృషికి తగ్గ గుర్తింపు ఇవ్వలేదు జగన్మోహన్ రెడ్డి. చివరకు మంగళగిరిలో ఆళ్ల రామకృష్ణారెడ్డికి టికెట్ కూడా ఇవ్వలేదు. దీంతో ప్రస్తుతం ఆ ఫ్యామిలీ అసంతృప్తితో ఉంది. ఆళ్ల అయోధ్య రామిరెడ్డి రాజ్యసభ పదవీకాలం జూన్ తో ముగియనుంది. ఆ కుటుంబం సైతం పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.




# 6 వందలకోట్లతో బెజవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధి

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి,డిసెంబర్ 15:

అమరావతి రాజధానికి దీటుగా విజయవాడ రైల్వే స్టేషన్ ను పిపిపి మోడ్ లో అభివృద్ధి చేయడానికి రైల్వే శాఖ సంసిద్ధమైంది. ఇప్పటికే ప్రతిపాదనలపై ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ద్వారా రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సెంట్రల్ గవర్నమెంట్ 661.11 కోట్ల రూపాయల నిధులు కూడా మంజూరు చేయడంతో రైల్వే యంత్రాంగం ఈ ప్రతిపాదనలకు శ్రీకారం చుట్టింది. మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్ వంటి తరహాలో అమరావతి రాజధానికి అతి సమీపంలోని విజయవాడ రైల్వే స్టేషన్ ను అభివృద్ధి చేసేందుకు ఎన్డీఏ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రతిపాదనలు రూపొందించారు. రైల్వే స్టేషన్ అభివృద్ధికి కావాల్సిన బ్లూ ప్రింట్ ను కూడా తయారు చేశారు. విజయవాడ రైల్వే స్టేషన్ ప్రాంతంలో 83.367 చదరపు మీటర్లుగా నిర్ణయించుకోగా వ్యాపార లావాదేవీలకు, స్టాల్స్, హోటల్ లాంటివి దగ్గర నుంచి రైల్వే కోటర్స్, స్టేషన్ కార్యాలయం వరకు 81.948 చదరపు మీటర్లలో అభివృద్ధి చేయనున్నారు. బెజవాడ రైల్వే స్టేషన్ ను విజయవాడ నగరానికి ఆకర్షణీయంగా నిలిచే విధంగా తూర్పు, పడమర వైపు ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నారు. తూర్పు ముఖద్వారం వైపు పార్లమెంటు ముఖద్వారానికి ధీటుగా సూపర్ లుక్‌తో ఆకట్టుకునే విధంగా నమూనాలను ఇప్పటికే తయారు చేశారు. అలాగే పడమర వైపు వన్ టౌన్ ప్రాంతమంతా కూడా వ్యాపారాలకు ప్రసిద్ధి. ఆ ప్రాంతంలో రైల్వే స్టేషన్ లో సైతం వివిధ వ్యాపారులకు అనుకూలంగా ఉండే విధంగా భవనాలను నిర్మిస్తున్నారు. ఇందులో రెండు మూడు అంతస్తులు వ్యాపారులకు అనుకూలంగా నిర్మించడానికి రంగం సిద్ధం చేశారు. ప్రస్తుతం విజయవాడ రైల్వే స్టేషన్ లో మూడు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ప్రయాణికులకు అందుబాటులో ఉన్నాయి. అయితే పెరిగిన రైళ్లకు తోడు ప్రయాణికుల సంఖ్య అత్యధికంగా పెరిగింది. దీంతో బడ్జెట్ను కూడా కేటాయించారు. ఇదిలా ఉండగా రైల్వే స్టేషన్ కు తూర్పు వైపు బయట ఉన్న సిటీ బస్టాండ్, స్కూటర్ పార్కింగ్ దగ్గర నుంచి టవర్ క్లాక్ ప్రాంతమంతా కూడా ఈ అభివృద్ధిలో మార్పులు చోటుచేసుకుని ఉన్నాయి. ఈ ప్రాంతం దగ్గర్లో స్టేషన్ కు చెందిన 41.70 చదరపు మీటర్ల ప్రాంతంలో జి ప్లస్ టు భవనం నిర్మించనున్నారు. అలాగే పడమర వైపు జి ప్లస్ టు 6.647 చదరపు మీటర్ల పరిధిలో భవనాలను నిర్మించనున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంతో రైల్వే అధికారులు చర్చలు జరిపారు. తూర్పు వైపు నిర్మించనున్న ముఖద్వారం కానీ జి ప్లస్ టు వంటి భవన నిర్మాణాలే కానీ అన్నిటికీ అనుకూలమైన ప్రదేశం ఉండగా పడమర వైపు గాంధీ హిల్ కొండ ప్రాంతంలోని 100 మీటర్ల మేర ఇప్పటికే రైల్వే వెస్ట్ బుకింగ్ కార్యాలయం, టీటీల విశ్రాంతి భవనంతో పాటు ఆర్పీఎఫ్ విశ్రాంతి భవనాలు నిర్మించి ఉన్నాయి. రైల్వే స్టేషన్ నిర్మాణానికి ఇప్పటికే గాంధీ హెల్కొండ ప్రాంతంలో మరికొంత భాగం స్టేషన్ అభివృద్ధికి కేటాయించాలని ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వంతో ఇప్పటికే చర్చలు జరిగినట్టు సమాచారం దీనికి ప్రభుత్వం సానుకూలం వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది.

# ఆ మూడు జిల్లాలపైనే ఆశలు

అనంతపురం, భారత శక్తి ప్రతినిధి,డిసెంబర్ 15:

వైఎస్ జగన్ ఆశలు 2029 ఎన్నికల్లో కూడా నెరవేరేటట్లు కనిపించేటట్లు లేదు. ఇందుకు అనేక కారణాలున్నాయి. కూటమి ప్రభుత్వం అనేక తప్పిదాలు చేసినప్పటికీ వారు జనంలో ఉంటున్నారు. ఇప్పటికే చంద్రబాబు నాయుడు కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని చెబుతున్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ నినాదం ప్రజల్లోకి బాగా వెళ్లినట్లు కనిపిస్తుంది. కూటమి కలిసి ఉన్నంత కాలం జగన్ అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉండకపోవచ్చని ఉండవల్లి అరుణ్ కుమార్ వంటి వారు కూడా చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ లో కుల రాజకీయాలకు ఎక్కువగా ప్రాధాన్యత ఉంటుంది. అదే సమయంలో కూటమి ప్రభుత్వం కూడా సంక్షేమ పథకాలను విస్మరించడం లేదు. వైసీపీకి ప్రస్తుతం రాయలసీమలోని మూడు జిల్లాల్లో తప్పించి ఎక్కడా బలం పుంజుకోలేదన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. రాయలసీమలోనూ కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలో మాత్రమే వైసీపీ ఈ రెండేళ్లలో కాస్త పుంజుకుందని, కానీ కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల్లో వైసీపీ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నది విశ్లేషకుల అంచనా. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు కొన్ని ప్రజల్లో అసంతృప్తికి గురి చేసినప్పటికీ అది వైసీపీకి ప్లస్ అయ్యేంతగా లేవన్నది వాస్తవం. ఎందుకంటే కొద్దో గొప్పో.. బతిమాలి కేంద్రం నుంచి నిధులను తీసుకు రావడంలో చంద్రబాబు ఒకింత సక్సెస్ అవుతుండటంతో వైసీపీ వైపు చూసే అవకాశం లేదంటున్నారు. ముఖ్యంగా పవన్ కల్యాణ్ వంటి వారు కూటమిలో మిత్రులుగా ఉండటం కూడా కలసి వచ్చే అంశమే. జనసేనకు ఓటింగ్ లేకపోయినా సామాజికవర్గం, ఫ్యాన్స్ బలం పోలింగ్ కేంద్రాల వద్ద కూటమికి అండగా ఉంటుందన్న భావన వ్యక్తమవుతుంది. పవన్ కల్యాణ్, చంద్రబాబు, లోకేశ్ లు నిత్యం జనంలో ఉండటంతో పాటు సమస్యల పరిష్కారానికి కొద్దో గొప్పో కృషి చేయడం కూడా కలసి వచ్చే అంశంగా చెబుతున్నారు. కూటమికి, జగన్ ప్రభుత్వానికి మధ్య పోలిక పెట్టి చూస్తే పెద్దగా తేడా లేకపోవడం కూడా ఎన్డీఏ విజయానికి దోహదపడతాయంటున్నారు. అయితే ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉండటంతో లెక్కలు మారే అవకాశాలు కూడా లేకపోలేదు. ఇప్పటి వరకూ అయితే జగన్ కు వచ్చే ఎన్నికల్లోనూ ఛాన్స్ లేనట్లేనని అంటున్నారు.

# పట్టు ఉడుం పట్టు...!! ఎల్లమ్మ జాతరలో గుండు ఎత్తు పోటీలు

తాండూరు భారత శక్తి ప్రతినిధి,డిసెంబర్ 15:

పట్టరా పట్టు ఉడుం పట్టు అంటూ క్వింటాల్ కు పైగా ఉండే ఒక్కొక్క గుండు రాళ్ళు ను గంజి హమాలీ కార్మికులు ఎత్తిపడేశారు. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో వెలసిన శ్రీ రేణుక నాగ ఎల్లమ్మ దేవాలయ జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా జాతర సాంప్రదాయ క్రీడల లో భాగంగాఆదివారం గంజ్ లో ఉన్న హమాలీ కార్మికులు గుండు రాళ్ళు ఎత్తే పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో సుమారు 10 మంది కార్మికులు పాల్గొన్నారు. ఒక్కొక్క రాయి క్వింటాల్ కి పైగా ఉన్న రాయిని ఒక్కరే ఉడుము పట్టు పట్టినట్లుగా ఎత్తి పడేయాలి. ఈ పోటీలలో ఒంటి చేతితో 74 కిలోల రాయిని మల్లప్ప అనే కార్మికుడు ఎత్తి విజయం సాధించాడు. ఒక క్వింటాల్ గుండు రాయిలను వంశీ, మల్లప్ప ఎత్తి విజయం సాధించారు దీంతో వారికి దేవాలయ నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు.

# కోహెడను డివిజన్ గా ప్రకటించాలి

రంగారెడ్డి , భారత శక్తి ప్రతినిధి,డిసెంబర్ 15:


జిహెచ్ఎంసిలో మున్సిపాలిటీ లను విలీనం చేసి నూతనంగా ఏర్పాటు చేసిన డివిజన్లలో 53వ డివిజన్ గా ఏర్పడిన తొర్రూరు డివిజన్ ని రద్దు చేసి కోహెడ ను డివిజన్ గా ప్రకటించాలని కోరుతూ కోహెడ అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. తుర్కయంజాల్ మరియు తొర్రూరు డివిజన్లను చార్మినార్ జోన్ లో కలుపుతూ ప్రభుత్వం ప్రకటించడానికి రద్దుచేసి ఎల్బీనగర్ జోన్ లో కలపాలని డిమాండ్ చేయాటం జరిగింది. 1000 ఎకరాల విస్తీర్ణం ఉన్న కోహెడను డివిజన్ గా ప్రకటించకుండా స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి తన స్వార్థపూరిత రాజకీయాల కోసం తన గ్రామం తొర్రూరును డివిజన్ గా చేశాడని ఆరోపించారు. కోహెడ ను డివిజన్ గా ఏర్పాటు చేసే వరకు నిరసన కొనసాగుతుందని హెచ్చరించారు అఖిలపక్ష నాయకులు...

# రైల్వే స్టేషన్లో గంజాయి పట్టివేత

వికారాబాద్ , భారత శక్తి ప్రతినిధి,డిసెంబర్ 15:

వికారాబాద్ జిల్లా తాండూర్ రైల్వే స్టేషన్లో కోణార్క్ ఎక్స్ ప్రెస్ రైల్ నుంచి దిగుతున్నాయి ఇతర ప్రాయానికుల నుంచి ఎక్సైజ్ పోలీసులు గంజాయి ప్యాకెట్లను పట్టుకున్నారు. వీటి తో పాటు గంజాయి చాక్లెట్లు కూడా లభ్యం అయ్యాయి. ఈ సందర్భంగా ఎక్సైజ్ డిప్యూటీ సూపర్నెంట్స్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విశ్వసనీయ సమాచార మేరకు కోణార్క్ ఎక్స్ప్రెస్ తో గంజాయి సరఫరా అవుతుందని అనుమానంతో ప్రయాణికులను చేస్తుండగా ఇద్దరు వ్యక్తుల నుంచి ఈ గంజాయి లభించినట్లుగా తెలిపారు వీరిని అదుపులో తీసుకొని విచారణ చేపడతామని అన్నారు.

# ఇక ఎమ్మెల్సీయేనా



విజయవాడ, భారత శక్తి ప్రతినిధి,డిసెంబర్ 15:

జనసేన ఎమ్మెల్సీ నాగబాబుకు మంత్రి పదవి ఇస్తామని ప్రకటించి ఏడాదవుతుంది. గత ఏడాది డిసెంబరు 9వ తేదీన ఈ ప్రకటన విడుదలయింది. చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో ఒక మంత్రి పదవి ఖాళీగా ఉండటంతో అది నాగబాబుకేనని జనసేన నేతలు ఫిక్స్ అయ్యారు. కానీ ఏడాది నుంచి నాగబాబు మంత్రి పదవి కోసం వెయిట్ చేస్తూనే ఉన్నారు. కానీ ఇంత వరకూ ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. దీంతో నాగబాబు కూడా పెద్దగా యాక్టివ్ గా పాలిటిక్స్ లో కనిపించడం లేదంటున్నారు. నాగబాబుకు మంత్రి పదవి దక్కుతుందని ఇటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అటు పవన్ కల్యాణ్ కూడా ప్రకటించారు. మీడియా సమావేశంలోనే వారు వివరించారు.కానీ ఏడాది గడుస్తున్నా నాగబాబుకు మంత్రి పదవి దక్కకపోవడానికి కారణం పవన్ కల్యాణ్ మాత్రమేనని చెబుతున్నారు. నాగబాబుకు మంత్రి పదవిపై పవన్ కల్యాణ్ క్లారిటీ కూడా ఇచ్చారు. తానే మంత్రి పదవిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. నాగబాబుకు మంత్రి పదవి ఇచ్చేవిషయంపై ఇప్పటి వరకూ చర్చ అంటూ ఏమీ జరగలేదని తెలిపారు. చంద్రబాబు నాయుడు తీసుకోవాల్సిన నిర్ణయం తీసుకున్నారని, కానీ తాను మాత్రమే దీనిపై ఆలోచిస్తున్నానని చెప్పడంతో పవన్ కల్యాణ్ నిర్ణయం వవల్లనే నాగబాబుకు మంత్రి పదవి ఆగిందని అనుకోవాలి. ఆగస్టులో ఉండవచ్చని పవన్ కల్యాణ్ అప్పుడే చెప్పినా ఆగస్టు ముగిసి నాలుగు నెలలవుతున్నా ఇంకా కార్యరూపం దాల్చలేదు.ఇక నాగబాబుకు మంత్రి పదవి దక్కే అవకాశం కనిపించడం లేదు. కుటుంబంలోని వారికే పదవులు ఇస్తున్నారని, ఒకే సామాజికవర్గానికి పదవులను పంచుతున్నారన్న విమర్శలను ఎదుర్కొనాల్సి వస్తుందని పవన్ కల్యాణ్ వెనకడగువేస్తున్నారంటున్నారు. . ఇప్పటికే జనసేనకు చెందిన ముగ్గురు మంత్రులుంటే అందులో ఇద్దరు కాపు సామాజికవర్గానికి చెందిన వారే. శాసనమండలిలో ఉన్న ఇద్దరు కూడా కాపు సామాజికవర్గానికి చెందిన వారే. ఇక మరో మంత్రి పదవి కూడా కాపు సామాజికవర్గానికి ఇస్తే తనపై కుల ముద్ర పడుతుందేమోనని పవన్ కల్యాణ్ ఆలోచనలో పడి నాగబాబుకు మోకాలడ్డినట్లు అంటున్నారు. మరొకవైపు నాగబాబు అవసరం పార్టీకి ఉంటుందని కూడా పవన్ కల్యాణ్ అభిప్రాయపడుతున్నారు. అందుకే నాగబాబు ఎమ్మెల్సీతో సరిపెట్టుకోవాల్సిందేనని జనసేన వర్గాలే చెబుతున్నాయి.

# బాహుబలి రాకెట్ ప్రయోగానికి సిద్ధం

నెల్లూరు, భారత శక్తి ప్రతినిధి,డిసెంబర్ 15:

ఇస్రో.. ఒకప్పుడు సైకిల్‌పై రాకెట్‌ను తీసుకెళ్లి ప్రయోగాలు చేపట్టింది. అంతరిక్ష ప్రయోగాల్లో దిగ్గజాలు అయిన రష్యా, చైనా , అమెరికా లాంటి దేశాలు మనల్ని అవహేళన చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇపుడు అదే రష్యా, అమెరికా దేశాలకు ఇస్రో కీలక ఉపగ్రహాలను నింగిలోకి ప్రవేశ పెట్టే స్థాయికి చేరుకుంది.. ఐదేళ్ల క్రితం వరకు చిన్న చిన్న ఉపగ్రహాలను మాత్రమే ప్రయోగించే సామర్థ్యం ఉన్న ఇస్రో ఇపుడు అత్యంత భారీ ఉపగ్రహాలను సైతం అంతరిక్షంలోకి ప్రవేశపెట్టే లెవల్ ఉన్న రాకెట్‌ను తయారు చేసింది.. మరో నాలుగైదు రోజుల్లో ఈ మెగా బాహుబలి రాకెట్ ప్రయోగం జరగనుంది.భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో మరో కీలక ప్రయోగానికి సిద్దమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రం నుంచి బ్లూబర్డ్?6 ప్రయోగం జరగనుంది. ఈ ఉపగ్రహాన్ని ఒఎం-03 ఓ6 అనే రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపనుంది బ్లూబర్డ్ శాటిలైట్. భారత్?అమెరికా సంయుక్తంగా ఈ ప్రయోగాన్ని చేపడుతున్నాయి. ఇస్రో రాకెట్ ప్రయోగ తేదీని ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. ఈ నెల 15 నుంచి 20 లోపు ప్రయోగం జరగనుంది. ఎల్‌వీఎమ్-3, ఓ6 రాకెట్ ప్రయోగానికి చాలా ప్రత్యేకత ఉంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ వద్ద రెండు టన్నుల బరువున్న ఉపగ్రహాలను మాత్రమే నింగిలోకి ప్రవేశ పెట్టగలిగేది. అంతకంటే బరువైన ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపాలంటే ఫ్రెంచ్, గయా, రష్యా లాంటి దేశాల సహకారంతో ఉపగ్రహాలను ప్రవేశపెట్టేది ఇస్రో.. ఇప్పుడు ఆ పరిస్థితులను అధిగమించింది.. ఒఎం ? 03 సరికొత్త వాహక నౌకను తయారు చేసింది.. 4 టన్నుల బరువు ఉన్న ఉపగ్రహాలను సైతం నింగిలోకి తీసుకెళ్లే సామర్థ్యం కలిగిన రాకెట్‌ను తయారు చేసి సక్సెస్ చేసింది. ఈ రాకెట్‌ను బాహుబలి రాకెట్‌గా పిలిచేవారు.. ఇప్పుడు అంతకు మించి అన్నట్లు ఇంకా చెప్పాలంటే బాహుబలి 2 రాకెట్ అన్నట్లు ఒఎం- 03 అప్‌గ్రేడ్ అయింది.. 6.5 టన్నుల బరువున్న అమెరికాకు చెందిన బ్లూ బర్డ్ ఉపగ్రహాన్ని నింగిలోకి ప్రవేశ పెట్టనుంది.. ప్రయోగ సమయాన్ని ఇస్రో అధికారికంగా ప్రకటించనుంది.టెక్సాస్ కేంద్రంగా పనిచేసే ం స్పేస్ మొబైల్ సంస్థ రూపొందించిన బ్లూబర్డ్ శ్రేణి ఉపగ్రహం ప్రపంచవ్యాప్తంగా నేరుగా మొబైల్ బ్రాడ్ బ్యాండ్ సేవలను మెరుగ్గా అందించేందుకు ఈ బ్లూ బర్డ్ శాటిలైట్‌ను రూపొందించారు. ఈ ఉపగ్రహం హై బ్యాండ్‌విడ్త్ నెట్వర్క్ అందించే సామర్థ్యం కలిగి ఉంటుంది. భూమిపై పనిచేస్తున్న మొబైల్ నెట్‌వర్క్ సేవలకు లైసెన్స్ స్పెక్ట్రమ్ ద్వారా అనుసంధానం చేసి.. సేవలను విస్తరించేలా ఈ వ్యవస్థ పని చేస్తుంది. అక్టోబరు 19న అమెరికా నుంచి బ్లూబర్డ్-6 ఉపగ్రహం శ్రీహరికోటకు చేరి అనుసంధాన పనులు, ఇంధన నింపుదల, తుది తనిఖీల పరిశీలనలు శాస్త్రవేత్తలు విజయవంతంగా పూర్తి చేశారు. ఇతర ఉపగ్రహాల కంటే మూడున్నర రెట్లు పెద్దదిగా, సుమారు పది రెట్లు అధిక డేటా సామర్థ్యంతో పనిచేయనుంది. ఇదే రాకెట్ ద్వారా భారత్ చేపట్టనున్న గగన్యాన్ ప్రాజెక్ట ద్వారా వ్యోమగాములను అంతరిక్షంలోకి తీసుకెళ్లనుంది ఇస్రో.





# సునీత ఒంటరి పోరాటం

కడప. భారత శక్తి ప్రతినిధి,డిసెంబర్ 15:

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగి ఏడేళ్లు కావస్తుంది. ఇప్పటి వరకూ హత్యకు గల కారణాలు.. హత్య చేసిందెవరన్నది తేల్చలేకపోయారు. వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత ఒంటరి పోరాటం చేస్తున్నారు. అదీ న్యాయ పోరాటం చేస్తున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో తనకు న్యాయం జరగలేని చెప్పిన సునీతకు ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా న్యాయం జరగకపోవడం ఏంటని సునీత ఆలోచించాల్సి ఉంది. అయితే ఇందులో ఆధారాలు లభించలేదా? లేక ఆధారాలను చెరిపేయడంతో విచారణలో అసలు వాస్తవాలు బయటకు రావడం లేదా? మరి దేశంలోనే అనేక క్లిష్టమైన కేసులను పరిష్కరించిన సీబీఐ వల్ల కూడా కావడం లేదంటే అసలు ఈ కేసులో ఏం జరుగుతుందన్నది అందరి మదిలో తలెత్తే ప్రశ్నలే.ఒక హత్య జరిగితే వెంటనే దానికి గల కారణాలను, నిందితులను ఎక్కడున్నా పట్టుకునే దర్యాప్తు అధికారులు వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మిస్టరీని ఎందుకు ఛేదించలేకపోతున్నారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది. నిజానికి ఆధారాలున్నా.. ఏమాత్రం సాంకేతికమైన చిన్నపాటి క్లూ లు లభించినా దర్యాప్తు అధికారులు వదిలిపెట్టే ప్రశ్న ఉండదు. కానీ వివేకానంద రెడ్డి హత్య జరిగింది 2019లో. ఏడేళ్లుగా కుమార్తె డాక్టర్ సునీత పోరాటం చేస్తుంది. అందులోనూ కూటమి ప్రభుత్వం అస్సలు ఊరుకోదు. తాజాగా సీబీఐని న్యాయస్థానం కూడా ఈ కేసులో కొంత వరకే దర్యాప్తు జరపాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈసారి దర్యాప్తులోనైనా అసలు కారణం అనేది బయటపడుతుందా? అన్నది అందరిలో కలిగే సందేహం. ఈ కేసులో కొందరిని అనుమానితులగా అరెస్ట్ చేసినా వారు అసలు వారు కాదన్నది సునీత వాదన.వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అనేక విషయాలు గత ఏడేళ్లుగా ప్రచారంలో ఉన్నాయి. అవన్నీ కట్టుకథలే. వాటికి ఎటువంటి ఆధారాలు లేవు. ఒక మాజీ ముఖ్యమంత్రి సోదరుడు, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు గురయి ఇన్నేళ్లవుతున్నా కనీసం హత్యకు గల కారణాలను బయట ప్రపంచానికి తెలియకపోవడంతో ఇక దర్యాప్తు సంస్థలపై కూడా ప్రజలకు దురభిప్రాయం ఏర్పడే అవకాశముంది. అలాంటి వారికే న్యాయం జరగనప్పుడు ఇక సామాన్యులకు సరైన న్యాయం ఎందుకు జరుగుతుందన్న ప్రశ్న తలెత్తుతుంది. వైఎస్ వివేకానందరెడ్డిది సహజ మరణం కాదు. ఖచ్చితంగా హత్యే. కానీ అందుకు గల కారణాలు ఇప్పటి వరకూ తెలియకపోవడం నిజంగా బాధాకరం. శోచనీయం.

# మారుతున్న గ్రామాల రహదారులు

కాకినాడ, భారత శక్తి ప్రతినిధి,డిసెంబర్ 15:

వచ్చే సంవత్సరం నిర్వహించనున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం గ్రామీణ రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించింది. కేంద్రం నుంచి రూ.2,120 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు, ఉపాధి హామీ పథకం కింద మరిన్ని నిధులతో గ్రామాల ముఖచిత్రాన్ని మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. 2026 మార్చి నాటికి అధిక శాతం రహదారుల నిర్మాణం పూర్తి చేయాలని కూటమి సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. పంచాయతీ ఎన్నికల నాటికి వీటి నిర్మాణం పూర్తి చేయాలని భావిస్తోంది.ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల



ఎన్నికలకు సమయం దగ్గర పడుతోంది. ఈ క్రమంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం, స్థానిక ఎన్నికలకు ఇప్పటి నుంచే ముందస్తు వ్యూహాలను సిద్ధం చేసుకుంటుంది. ప్రస్తుత పంచాయతీల గడువు వచ్చే 2026, ఏప్రిల్ 2తో ముగుస్తుంది. ఆ తర్వాత తిరిగి పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి. కాస్త అటు ఇటు అయినా సరే.. 2026 ఏడాది చివరి నాటికి రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉంటుంది.ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించింది. మరీ ముఖ్యంగా గ్రామీణ రహదారుల రూపురేఖలు పూర్తిగా మార్చబోతున్నారు. ఇప్పటికే గుంతల రోడ్లను మరమ్మతులు చేసేందుకు గాను 'పల్లె పండుగ' పేరుతో వినూత్న కార్యక్రమం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే.పంచాయతీ ఎన్నికల నిర్వహణ కన్నా ముందే వాటి అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. దీనిలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులను ఇప్పటికే సమీకరించుకుంది. సాస్కీ (స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) కింద కొన్ని రోజుల క్రితమే కేంద్ర ప్రభుత్వం ఏపీకి రూ. 2,120 కోట్లను మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి ఖర్చు చేయనున్నారు. అలానే 15వ ఆర్థిక సంఘం నిధులు మరో రూ. 900 కోట్లతో పాటుగా.. ఉపాధి హామీ పథకం కింద కేంద్రం నుంచి ఏపీకి మరో రూ. 2 వేల కోట్లు వరకు నిధులు రానున్నాయి.ఈ మొత్తం భారీ నిధులతో పల్లెల ముఖచిత్రాన్ని మార్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ నిధులను వినియోగించి.. 2026, మార్చి నాటికి గ్రామీణ ప్రాంతాల్లో అధిక శాతం రహదారుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని కూటమి సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. ఆ దిశగా చర్యలు వేగవంతం చేసింది.ఇదిలా ఉంటే.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఏపీలో రూ. 2 వేల కోట్ల ఉపాధి నిధులతో రాష్ట్రవ్యాప్తంగా 4 వేల కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కూడా మరో రూ. 2 వేల కోట్ల ఉపాధి నిధులను రహదారుల నిర్మాణం కోసం ఖర్చు చేయనున్నారు. పల్లె పండుగ బకాయిలకు సంబంధించి త్వరలోనే మరో రూ. 200 కోట్లు విడుదల చేయడానికి సిద్ధమవుతున్నారు.కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో.. గత వైసీపీ హయాంలో పూర్తిగా ధ్వంసమైన గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుంది. ఇందుకోసం గ్రామీణ ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో రహదారుల నిర్మాణం, అభివృద్ధి చేపట్టనుంది. వీటితో పాటు సర్కార్.. ఏపీలోని గ్రామ పంచాయతీల్లో పట్టణ స్థాయి సదుపాయాలు కల్పించేందుకు అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా కొన్ని రోజుల క్రితం స్వర్ణ పంచాయతీ పోర్టల్‌ను ప్రారంభించారు. దీని ద్వారా ఇన్నాళ్లు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకే పరిమితమైన ఆన్‌లైన్ వ్యవస్థను గ్రామీణ ప్రాంతాలకూ తీసుకొచ్చారు.

# రైతులకు రిలీఫ్...



గుంటూరు,భారత శక్తి ప్రతినిధి,డిసెంబర్ 15:జరీబు భూముల సమస్యను నెల రోజుల్లోగా పరిష్కరిస్తామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. రాయపూడిలోని సీఆర్డీఏ కార్యాలయంలో త్రిసభ్య కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి పొంగూరు నారాయణ, ఎమ్మెల్యే శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.. నెల రోజుల్లో జరీబు భూముల సమస్యను పరిష్కరిస్తామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు.జరీబు భూముల సమస్యపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కీలక వ్యాఖ్యలు చేశారు. నెల రోజుల్లోగా జరీబు భూముల సమస్యలను పరిష్కరిస్తామని ప్రకటించారు. సీఆర్డీఏ కార్యకలాపాలపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. జరీబు భూముల సమస్యలపై స్పందించారు. అలాగే పరీక్షలు నిర్వహించి నేల స్వభావం గురించి నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి వెల్లడించారు. లంక భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించామని వివరించారు. మరోవైపు అమరావతిలో భూ సమీకరణ చేపట్టని భూముల్లో ప్లాట్లు పొందిన రైతుల సమస్య పెండింగ్‌లో ఉందని కేంద్ర మంత్రి వెల్లడించారు. అక్కడి రైతులతో మాట్లాడిన తర్వాత భూసేకరణకు వెళ్తామని స్పష్టం చేశారు.వేరే చోట ప్లా?ట్లు కావాలని కోరిన వారికి లాటరీ ద్వారా కేటాయించేలా ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు.మరోవైపు అమరావతి భూ సమీకరణకు సంబంధించి 2004 మంది రైతులు భూములను భూ సమీకరణకు ఇవ్వలేదని మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. వారితో మరోసారి మాట్లాడనున్నట్లు వెల్లడించారు. 26 గ్రామాల్లో డీపీఆర్ చేసి ఇస్తామన్న పెమ్మసాని చంద్రశేఖర్.. సోమవారం నుంచి బౌండరీ స్టోన్స్‌లను రెండు వైపులా వేయనున్నట్లు వెల్లడించారు. సోమవారం తరువాత గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి.. సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గురించి, గ్రామ అభివృద్ధి ప్రణాళికల గురించి చర్చించనున్నట్లు పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు.మరోవైపు అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలని భావిస్తున్న ఏపీ ప్రభుత్వం.. అమరావతిని మరింత విస్తరించాలని భావిస్తోంది. అందులో భాగంగానే రెండో విడత భూసమీకరణ చేపట్టాలని ఇటీవల నిర్ణయించింది. తొలి విడతలో రైతుల నుంచి 33 వేల ఎకరాలను ల్యాండ్ పూలింగ్ విధానం కింద సమీకరించిన ఏపీ ప్రభుత్వం.. రెండో విడతలో 16666 ఎకరాలను సమీకరించాలని నిర్ణయించింది. మొత్తం ఏడు గ్రామాల పరిధిలో ఈ భూములను సమీకరించనున్నారు.ఇందుకోసం రైతుల అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. అమరావతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ, అమరావతి అంతర్జాతీయ విమానాశ్రయం వంటి నిర్మాణాలను చేపట్టాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. అందుకోసం అదనంగా భూములను సమీకరించనున్నారు.పెదమద్దూరు, వడ్లమాను, ఎండ్రాయి, కర్లపూడి, వైకుంఠపురం, పెదపరిమి, హరిశ్చంద్రపురం గ్రామాల పరిధిలో భూములను సమీకరించనున్నారు

# ఆ ప్రాంతాలకు మహర్దశ

విశాఖపట్టణం,భారత శక్తి ప్రతినిధి,డిసెంబర్ 15:

అనకాపల్లిలో నక్కపల్లి క్లస్టర్ రహదారిని విస్తరించనున్నారు. జాతీయ రహదారి 16 నుంచి నక్కపల్లి క్లస్టర్ వరకూ 36 కోట్ల రూపాయలతో రెండు వరుసల రహదారిని నిర్మిస్తున్నారు. అయితే భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఈ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాలని నిర్ణయించారు. రూ.67.20 కోట్లతో నాలుగు వరుసలుగా విస్తరించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి మంజూరైంది. అలాగే మధురవాడ ఐటీ హిల్‌లో బీటీ రోడ్ నిర్మాణానికి కూడా అనుమతి ఇచ్చారు.అనకాపల్లి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. పరిశ్రమల ఏర్పాటులో భాగంగా అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్కులు ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నక్కపల్లి క్లస్టర్ రహదారిని విస్తరించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా 16వ నంబర్ జాతీయ రహదారి నుంచి నక్కపల్లి క్లస్టర్‌కు నిర్మిస్తున్నరెండు వరుసల రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఔఊ- 16 నుంచి నక్కపల్లి క్లస్టర్‌కు 36 కోట్ల రూపాయలతో రెండు వరుసల రహదారిని నిర్మిస్తున్నారు. అయితే ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రెండు వరుసలను 4 వరుసలుగా విస్తరించాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.67.20 కోట్లు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.మరోవైపు అనకాపల్లి జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు నేపథ్యంలో నక్కపల్లి మండలం కాగిత నుంచి నిర్మిస్తున్న ఇండస్ట్రియల్ కారిడార్‌ను మరింత విస్తరించనున్నారు. ఈ ప్రాంతంలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. భూసేకరణ ప్రాంతాల్లోని గ్రామాల్లో రహదారులు, పరిపాలన భవనాలు, కాలువలు నిర్మించనున్నారు. అలాగే ఫ్యాక్టరీలు ఏర్పాటయ్యే ప్రదేశానికి చేరుకునేందుకు నేషనల్ హైవే నుంచి 4.4 కిలోమీటర్ల మేరకు రహదారి నిర్మిస్తున్నారు.2025 మార్చి నెలలో ఈ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ రహదారి నిర్మాణం కోసం 26 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. మరోవైపు ఈ రహదారి మీదుగానే బల్క్ డ్రగ్ పార్కు, స్టీల్ ప్లాంట్‌కు వాహనాలు రాకపోకలు సాగించనున్నాయి. ఈ నేపథ్యంలో దీనిని మరింత విస్తరించేందుకు ప్రణాళికలు రచించారు.మరోవైపు విశాఖపట్నంలోని మధురవాడ ఐటీ హిల్‌లో రహదారి నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మధురవాడ ఐటీ హిల్-3లో బీటీ రోడ్డుతో పాటుగా .. రిటైనింగ్ గోడ నిర్మాణానికి అనుమతిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ రహదారి నిర్మాణం కోసం.. ఏపీఐఐసీ టెండర్లు కూడా పిలిచింది. ఇందులో అందరి కంటే తక్కువగా కోట్‌చేసిన కాంట్రాక్టర్ సంస్థకు పనులు అప్పగించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఐటీ హిల్స్‌లో వివిధ పరిశ్రమలు ఏర్పాటు అవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

# దేశంలో ఏడో ప్లేస్‌లో తెలంగాణ ఎగుమతులు...

హైదరాబాద్,భారత శక్తి ప్రతినిధి,డిసెంబర్ 15:

తెలంగాణ ఎగుమతులు ఈ ఏడాది గణనీయంగా పెరిగాయి. దేశంలో తెలంగాణ ఎగుమతుల్లో ఏడో ర్యాంకు సాధించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన 'హ్యాండ్‌బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆన్ ఇండియన్ స్టేట్స్ 2024?25' ప్రకారం, తెలంగాణ ఎగుమతులు 2023?24లో 14,026 మిలియన్ డాలర్ల నుంచి 2024?25లో 19,123 మిలియన్ డాలర్లకు పెరిగాయి. ఇది ఒకేఏడాదిలో 5,097 మిలియన్ డాలర్ల (సుమారు 5 వేల మిలియన్ డాలర్ల) పెరుగుదల. 2017?18 నుంచి ఎనిమిదేళ్ల డేటాలో దేశంలో ఎగుమతుల విలువలో తెలంగాణకు ఏడో స్థానం లభించింది.

ఐటీ, ఫార్మా రంగా ఉత్పత్తులే ప్రధానం..

తెలంగాణ ఎగుమతుల్లో ఐటీ సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులు, ఔషధ ఫార్ములేషన్లు, బల్క్ డ్రగ్స్ ప్రధాన భాగం. ఇంజనీరింగ్ వస్తువులు, రసాయనాలు, ఏరోస్పేస్ పరికరాలు, వ్యవసాయ ఉత్పత్తుల్లో విత్తనాలు, బియ్యం, పత్తి కూడా కీలకం. ఐటీ ఎగుమతుల్లో దేశంలో అత్యధిక పెరుగుదల సాధించిన రాష్ట్రాల్లో తెలంగాణ ముందంజలో ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

గుజరాత్ టాప్, చండీగఢ్ లాస్ట్..

దేశంలో గుజరాత్ ఎగుమతుల్లో మొదటి స్థానం కొనసాగుతోంది. 2024?25లో 1,16,332 మిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు జరిగాయి. అయితే గత మూడేళ్లుగా ఇక్కడ తగ్గుదల కనిపిస్తోంది. చండీగఢ్‌లో ఎగుమతులు అతి తక్కువగా 14 మిలియన్ డాలర్లు మాత్రమే. తెలంగాణ కంటే ఎక్కువ ఎగుమతులు చేసిన రాష్ట్రాలు.. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తరప్రదేశ్.

తెలంగాణ ఎగుమతుల పురోగతి (మిలియన్ డాలర్లలో)

సంవత్సరం ఎగుమతుల విలువ 2017 -18 6,5722018?19 7,168 2019-20 7,359 2020-21 8,7072021-22 10,951 2022-23 11,412 2023-24 14,026 2024-25 19,123

# భారీగా పెరిగిన ఫారెక్స్ నిల్వలు

ముంబై, భారత శక్తి ప్రతినిధి,డిసెంబర్ 15:

మన రూపాయి విలువ కొన్ని రోజులుగా ఆల్‌టైమ్ కనిష్టస్థాయి పడిపోయింది. 90 మార్కును తాకింది. దీంతో మన ఎగుమతులపై ప్రభావం పడుతోంది. అయితే ఇదే సమయంలో మన ఫారెక్స్ నిల్వలు పెరిగాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకారం, డిసెంబర్ 5తో పూర్తయిన వారంలో విదేశీ మారక నిల్వలు 1.033 బిలియన్ డాలర్ల వృద్ధితో 687.26 బిలియన్ డాలర్లకు చేరాయి. ముఖ్య కారణం బంగారం నిల్వలు 1.19 బిలియన్ డాలర్లు కలుపుకుని 106.98 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే, ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 151 మిలియన్ డాలర్లు క్షీణించి 556.88 బిలియన్ డాలర్లకు తగ్గాయి. ఈ నిల్వలు సెప్టెంబర్‌లోని చారిత్రక గరిష్ఠం 704.89 బిలియన్ డాలర్లకు సమీపంలో ఉండి, 11 నెలల దిగుమతులను పుదినపెట్టే స్థితిలో ఉన్నాయి.డిసెంబర్ 10న అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీలను 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 3.5?3.75%కి నిర్ణయించడంతో ప్రపంచవ్యాప్తంగా బంగారం, వెండి రేట్లు గణనీయంగా పెరిగాయి.

అంతర్జాతీయ స్పాట్ గోల్డ్ ధర డిసెంబర్ 12 నాటికి ఔన్స్‌కు 4,338 డాలర్లకు చేరి ఏడు వారాల శిఖరాన్ని తాకింది. భారతదేశంలో డిసెంబర్ 13న 24 క్యారట్ బంగారం గ్రాముకు రూ.13,321కు ట్రేడైంది. రూపాయి మృదుత్వం, పెట్టుబడుల ఆకర్షణ కొనసాగడం ఈ ధరలకు మంచి మద్దతుగా నిలిచాయి.దేశీయ వెండి ధరలు వేగవంతమైన పునరుద్ధరణ చూపుతున్నాయి. డిసెంబర్ 13న గ్రాముకు రూ.204.10 (కిలోకు రూ.2,04,100)గా నమోదైంది. వారం క్రితం రూ.1.87 లక్షల నుంచి గణనీయ పెరుగుదల నమోదైంది. సౌర శక్తి, ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్ రంగాల డిమాండ్, సరఫరా కొరతలు ఈ ర్యాలీకి కారణాలు.డాలర్‌తో పోలిస్తే రూపాయి 90 మార్క్‌ను దాటి 2025లో 5%కి అధికంగా క్షీణించి ఆసియా బలహీన కరెన్సీగా మారింది. ఇది దేశీయ లోహ ధరలను మరింత భారీగా చేస్తోంది. అయినప్పటికీ, ప్రపంచ ఆర్థిక అస్థిరతల్లో పెట్టుబడిదారులు ఈ లోహాలను సురక్షిత ఆస్తులుగా ఎంచుకుంటున్నారు.

# రాహుల్ పై సోషల్ మీడియాలో సెటైర్లు గ్లోబల్ సమ్మిట్ కంటే మెస్సీనే ఎక్కువా అంటూ కామెంట్స్



హైదరాబాద్, ఒభారత శక్తి ప్రతినిధి,డిసెంబర్ 15:

తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడులను ఆహ్వానించేందుకు, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు పెంచేందుకు డిసెంబర్ 8, 9వ తేదీల్లో హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించింది. ఈ సమ్మిట్‌కు దేశంలోని వ్యాపారులతోపాటు వివిధ దేశాల ప్రతినిధులు, వ్యాపారులు హాజరయ్యారు. కానీ కాంగ్రెస్‌అధికారంలో ఉన్న రాష్ట్రంలో జరుగుతున్న సమ్మిట్‌కు ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ మాత్రం రాలేదు. కానీ డిసెంబర్ 13న హైదరాబాద్‌కు వచ్చిన అర్జెంటీనా ఫుట్‌బాల్ ప్లేయర్ జెస్సిని చూసేందుకు మాత్రం ప్రత్యేక విమానంలో ల్యాండ్ అయ్యారు. ఇదే ఇప్పుడు చర్చనీయాంశమైంది.తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డెప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాహుల్ గాంధీకి ప్రత్యేక ఆహ్వానాలు పంపినప్పటికీ, డిసెంబర్ 8, 9 తేదీల్లో జరిగిన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు ఆయన ఒక్క రోజు కూడా రాలేదు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరును ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయాల్సిన అవకాశాన్ని వదులుకున్నారు.అదే సమయంలో లియోనెల్ మెస్సీని కలవడానికి రాహుల్ ప్రత్యేక ఫ్లైట్‌తో హైదరాబాద్ చేరుకున్నారు. రాష్ట్ర పాలనా విజయాలకు ముందు వ్యక్తిగత ఆసక్తులకు ప్రాధాన్యత ఇవ్వడం రాజకీయ వర్గాల్లో, సామాన్య ప్రజల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ చర్య పార్టీ ఇమేజ్‌పై ప్రతికూల ప్రభావం చూపవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.ఆరు నెలలుగా ఎస్ఐఆర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) విషయంపై పార్టీ ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ, పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో చర్చ ప్రారంభమైన గంట వరకు లోక్‌సభలో రాహుల్ లేకపోవడం గమనార్హం. తర్వాత వచ్చి కొన్ని ప్రశ్నలు లేవనెత్తడం ప్రతిపక్ష బాధ్యతలకు సరిపోతుందా అనేది ప్రశ్న. ఇది ఆయన రాజకీయ జాగ్రత్తలపై సందేహాలు రేకెత్తిస్తున్నాయి.మొత్తంగా రాహుల్ గాంధీ చర్యల్లో దృఢసంకల్పం, స్థిరత్వం కనిపించకపోవడం కాంగ్రెస్ భవిష్యత్తుకు సవాల్‌గా మారుతోంది. రాష్ట్ర ప్రభుత్వాలకు మద్దతు, జాతీయ అంశాలపై పట్టుదల చూపకపోతే పార్టీ ఆకర్షణ క్షీణిస్తుందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ ట్రెండ్ కొనసాగితే 2029 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మరింత కష్టమని పేర్కొంటున్నారు.

# టార్గెట్ 160 దిశగా విజయ్ వ్యూహాలు

చెన్నై, భారత శక్తి ప్రతినిధి,డిసెంబర్ 15:

తమిళనాడులో ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. అందులోనూ ఇటీవల పార్టీని ఏర్పాటు చేసిన నటుడు విజయ్ మరింత స్పీడ్ పెంచారు. పార్టీ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నిర్ణయాల కోసం కమిటీలను నియామకం జరిగింది. తమిళనాట డీఎంకే పార్టీకి తానే ప్రత్యామ్నాయం అని నిరూపించుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఎండీఎంకే పార్టీకి బలంగా ఉన్న కొంగు మండలం ప్రాంతంలో పాగా వేసి వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నారు.తమిళనాడులో 2026 తొలి త్రైమాసికంలో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలకు కొద్ది నెలలే ఉండడంతో రాజకీయ పార్టీలు వ్యూహాలు, ప్రతి వ్యూహాలతో ముందుకు వెళుతున్నాయి. ఇప్పటిదాకా తమిళనాడులో డీఎంకే, ఏడిఎంకె పార్టీలే మార్చి.. మార్చి అధికారాన్ని సొంతం చేసుకుంటూ వస్తున్నాయి. ఇటీవల నటుడు విజయ్ సొంత పార్టీని ఏర్పాటు చేసి ఈసారి ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నారు. గత మూడు నెలలుగా శని ఆదివారాలు ప్రజల్లోకి వెళ్లేందుకు వీకెండ్ టూర్ ఏర్పాటు చేసుకున్న విజయ్ ఆ దిశగా వరుస సభలు నిర్వహించారు. అయితే కరూర్ లో తొక్కిసలాటలు 41 మంది మృతి చెందడంతో సభలకు ఇచ్చే అనుమతి విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. దీంతో టీవీకె పార్టీ స్పీడ్ కాస్త తగ్గింది..అయితే ప్రధాన పార్టీల నుంచి సీనియర్ లీడర్లను తమ వైపు తిప్పుకోవడంలో విజయ్ బాగా సక్సెస్ అయ్యారు. తొమ్మిది సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అన్నాడీఎంకెలో సీనియర్ గా ఉన్న మాజీమంత్రి సెంగోట్టియన్, మరో సీనియర్ నేత నాంజల్ సంపత్ సహా పలువురు విజయ్ పార్టీలో చేరారు. ఎఐడీఎంకే నుంచి మరికొందరు సీనియర్ నేతలను పార్టీలోకి చేర్చుకునేందుకు ఇప్పటికే రంగం సిద్ధమైంది. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ప్రజల్లోకి వెళ్ళేందుకు మరింత వ్యూహాత్మకంగా విజయ్ ఏర్పాట్లు చేసుకుంటున్నారు.చెన్నైలోని పార్టీ కార్యాలయంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచార కార్యక్రమాలు, కూటమి ఏర్పాటులో ఏఏ పార్టీ ఉండాలి అన్న అంశంపై నిర్ణయాలు.. ఎన్నికల మేనిఫెస్టో లో ఏ ఏ అంశాలు ఉండాలి. ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. అందుకోసం ఏర్పాటు చేసిన కమిటీలు వాటికి సంబంధించిన నివేదికలు సిద్ధం చేయనున్నాయి. విజయ్ సీఎం అభ్యర్థిగా అంగీకరించే పార్టీలతోనే పొత్తు ఉంటుందని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.



ఎన్నికల్లో తమ మేనిఫెస్టో లో ఉండాల్సిన అంశాల పై కమిటీ నివేదిక రూపొందించాలని విజయ్ సూచించినట్లు సమాచారం. ప్రచార కార్యక్రమాలు సభల విషయంలో అందుకోసం ఏర్పాటు చేసిన కమిటీ ప్రణాళికలను సిద్ధం చేయాల్సి ఉంటుంది. విజయ్ తమిళనాడులో డీఎంకే పార్టీకి కూడా సాధ్యం కానీ కొంగు మండలంలో పట్టు ఏడీఎంకే పార్టీకి ఉంది.. అలాంటి చోట పట్టు సాధించడం కోసం అక్కడ బలమైన నాయకుడు మాజీ సీఎం పలనీ స్వామి సామాజిక వర్గానికి చెందిన సెంగోటియన్ ను పార్టీలోకి చేర్చుకున్నారు విజయ్. సంస్థాగతంగా పార్టీ బలపడాలంటే పార్టీలో అనుభవం ఉన్న ఇలాంటి సీనియర్లు ఉండాలని భావించిన విజయ్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇదేవిధంగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఒక్కో సీనియర్ నేతను తన పార్టీలోకి చేర్చుకుని సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసే దిశగా ముందుకు వెళుతున్నారు. మరోవైపు ఏడిఎంకె బీజేపీ కోటమిలోకి విజయ్ ను తీసుకురావాలని ఆ రెండు పార్టీలు తీవ్రంగా ప్రయత్నించినా అది కుదరలేదు. తీరా ఏడీఎంకెలోని బలమైన నేతలని తన వైపు లాక్కుని అన్నాడీఎంకే కి కోలుకోలేనీ దెబ్బ తగిలేలా చేస్తున్నారు.

# కమలానికి కొత్త సారధి నితిన్ నబిన్



న్యూఢిల్లీ, భారత శక్తి ప్రతినిధి,డిసెంబర్ 15:

నితీష్ కుమార్ ప్రభుత్వంలో పిడబ్ల్యుడి మంత్రిగా ఉన్న నితిన్ నబిన్ సిన్హాను తన భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించింది. ఆయన ఐదవసారి బంకిపూర్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన మొదటిసారి 2021లో నితీష్ కుమార్ మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఎంత ఆస్తిని కలిగి ఉన్నారో అందరూ తెలుసుకోవాలనుకుంటున్నారు.2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై నితిన్ నవీన్ గెలిచారు. ఆయన తన అఫిడవిట్‌లో తన వయస్సు 45 సంవత్సరాలు అని పేర్కొన్నారు. ఆయన 12వ తరగతి పాస్ అయ్యారు. నబిన్ 1996లో మెట్రిక్యులేషన్, 1998లో ఇంటర్మీడియట్ డిగ్రీ ఉత్తీర్ణుడయ్యాడని పేర్కొన్నాడు. అతను తన ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యను దేశ రాజధాని ఢిల్లీలో పూర్తి చేశాడు. అతను 1996లో సెయింట్ మైఖేల్స్ స్కూల్ నుండి తన ఉన్నత పాఠశాలను, 1998లో ఊఐఓ పబ్లిక్ స్కూల్ నుండి తన 12వ తరగతిని పూర్తి చేశాడు.నితిన్ నబిన్ మొత్తం ఆస్తులు రూ 3.10 కోట్లు, అప్పులు రూ. 56.7. కోట్లు. ఆయన దగ్గర రూ. 35,000 నగదు మాత్రమే ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయనకు వివిధ బ్యాంకుల్లో ఏడు బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. వీటిలో మొదటి బ్యాంకు ఖాతాలో రూ. 90,000, రెండవ బ్యాంకు ఖాతాలో రూ. 7 లక్షలు, మూడవ బ్యాంకు ఖాతాలో రూ. 12 లక్షలు, నాల్గవ బ్యాంకు ఖాతాలో రూ. 10 లక్షలు, ఐదవ బ్యాంకు ఖాతాలో రూ. 5 లక్షలు, ఆరవ బ్యాంకు ఖాతాలో రూ. 5 లక్షలు, ఏడవ బ్యాంకు ఖాతాలో రూ. 10 లక్షలు ఉన్నాయి. అదనంగా,ఆయనకు రెండు వాహనాలు ఉన్నాయి. రూ. 13 లక్షల రూపాయలు విలువైన స్కార్పియో, 25 లక్షల రూపాయలు విలువైన ఇన్నోవా క్రిస్టా. ఆయనకు నగలు కూడా ఉన్నాయి. అఫిడవిట్ ప్రకారం, నితిన్ నబిన్ కు రూ 76,000 విలువైన బంగారు గొలుసు, రూ. 64,000 విలువైన బంగారు ఉంగరం ఉన్నాయి.నితిన్ నబిన్ పాట్నాలో జన్మించాడు. అతని తండ్రి నవీన్ కిషోర్ ప్రసాద్ సిన్హా ప్రముఖ బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే. రాజకీయాల్లోకి రాకముందు, నితిన్ నబిన్ భారతీయ యువ మోర్చాలో చురుకుగా ఉండేవాడు.



# రంగంలోకి కేసీఆర్

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి,డిసెంబర్ 15:

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక సమావేశంలో పాల్గొననున్నారు. డిసెంబర్ 19 జరిగే బీఆర్ఎస్ ఎల్పీ సమావేశంలో.. కృష్ణా, గోదావరి జలాలపై కాంగ్రెస్ నిర్లక్ష్యం, పార్టీ సంస్థాగత నిర్ణయాలు, రాబోయే ప్రజా ఉద్యమాలపై కేసీఆర్ చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రైతుల నీటి హక్కులపై బీఆర్ఎస్ పోరాటానికి సిద్ధమవుతోన్న తరుణంలో ఈ సమావేశంలో కేసీఆర్ పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే పార్టీ నేతలకు దిశానిర్దేశం చేస్తారా.. లేక ఆయనే స్వయంగా రంగంలోకి దిగుతారా అనే విషయంపై స్పష్టత లేదు.బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు కీలక సమావేశంలో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 19న బీఆర్ఎస్ఎల్పీ, రాష్ట్రస్థాయి కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశంలో గులాబీ బాస్ పాల్గొనే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన ఆరోజు మధ్యాహ్నం 2 గంటలకు నుంచి ఈ సమావేశం జరగనుందని పార్టీ వర్గాలు తెలిపాయి. దీంతో కొంత కాలం తర్వాత ఇలాంటి పార్టీ సమావేశాల్లో కేసీఆర్ పాల్గొనబోతున్నారు.కాగా, భారత్ రాష్ట్ర సమితి లెజిస్లేచర్ పార్టీ (బీఆర్ఎస్ఎల్పీ) సమావేశంలో పలు అంశాలపై కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించనున్నట్లు తెలుస్తోంది. అందులో ముఖ్యంగా కృష్ణా, గోదావరి నదీ జలాలపై కాంగ్రెస్ ప్రభుత్వం వహిస్తున్న నిర్లక్ష్య వైఖరి గురించి, పార్టీ సంస్థాగత నిర్ణయాలు, కార్యచరణపై చర్చిస్తారు. అంతేకాకుండా రాబోయే ప్రజా ఉద్యమాలు, సాగునీటి హక్కుల విషయంలో బీఆర్ఎస్ వైఖరి ఏంటి, రాష్ట్రానికి అన్యాయం చేసేలా నిర్ణయాలు, రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీరుపై ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికే రైతుల నీటి హక్కులపై మరో ఉద్యమానికి బీఆర్ఎస్ సిద్ధమైంది. ఈ నేపథ్యంలో తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ స్వయంగా బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఈ సమావేశం గురించి బీఆర్ఎస్ పార్టీ ఇంకా పూర్తి వివరాలు వెల్లడించలేదు.కాగా, ఆంధ్రప్రదేస్ ప్రభుత్వం పోలవరం- బనకచర్ల ప్రాజెక్ట్ చేపట్టేందుకు ప్రయత్నించిన విషయం తెలిసిందే. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన తెలంగాణ.. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. దీంతో ఈ ప్రాజెక్ట్‌ను ఏపీ పక్కన పెట్టాల్సివచ్చింది. ఇప్పుడు పోలవరం - నల్లమల సాగర్ ప్రాజెక్ట్‌ను ఏపీ ప్రభుత్వం తెర మీదకు తీసుకొచ్చింది. దీనిపై కూడా కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే దీన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు తెలంగాణ భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. పోలవరం - బనకచర్ల ప్రాజెక్ట్ పేరును నల్లమల సాగర్ ప్రాజెక్ట్‌గా మార్చి ఏపీ ప్రభుత్వం మళ్లీ అదే పని చేస్తోందని మంత్రి కేంద్ర జలశక్తి శాఖకు లేఖ రాసిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ కొత్తగా చేపడుతున్న ప్రాజెక్టులపై తెలంగాణ.. కేంద్రానికి ఫిర్యాదు చేయాల్సి వస్తోంది. దీనికి తోడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నీటి హక్కులపై ఉదాసీనంగా వ్యవహరిస్తోందంటూ బీఆర్ఎస్ విమర్శలు గుప్పిస్తోంది. అందులో భాగంగా రైతుల నీటి హక్కులపై పోరాటం చేయాలని బీఆర్ఎస్ పార్టీ అగ్రనాయకత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో కేవలం పార్టీ నేతలకు దిశానిర్దేశం చేసి వదిలేస్తారా.. లేక కేసీఆ స్వయంగా రంగంలోకి దిగుతారా అనే విషయంపై క్లారిటీ లేదు. ఒకవేళ కేసీఆర్ స్వయంగా ఉద్యమంలోకి దిగితే మాత్రం.. కాంగ్రెస్ ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# బీజేపీ ప్రక్షాళన

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి,డిసెంబర్ 15:



తెలంగాణ బీజేపీ నేతలపై ఎప్పటికప్పుడు కేంద్ర నాయకత్వం నివేదికలు తెప్పించుకుంటునట్లే ఉంది. ఇక్కడ నేతల మధ్య సమన్వయం లేదు. ఒకరంటే ఒకరికి పడదు. పార్టీ నాయకత్వం పటిష్టంగా ఉన్నప్పటికీ, ఓటు బ్యాంకు బలంగా ఉన్నా వాటిని పార్టీకి అంటుకుపోయేలా చేయడంలో మాత్రం నాయకత్వం విఫలమవుతున్నట్లు కేంద్ర నాయకత్వానికి నిఘా నివేదికలు అందినట్లే అర్థమవుతుంది. నాయకుల మధ్య ఆధిపత్య పోరు పార్టీని బలోపేతం చేయలేకపోతుందన్న భావన కేంద్ర నాయకత్వంలో కనిపిస్తుంది. కేంద్ర మంత్రులు ఇద్దరు ఉన్నప్పటకీ, ఎనిమిది మంది పార్లమెంటు సభ్యులున్నా, ఎనిమిది మంది శాసనసభ్యులున్న కార్యకర్తల విషయంలో నిర్లక్ష్యం కనిపిస్తుందని పసిగట్టింది.అందుకే తెలంగాణ బీజేపీ ఎంపీలకు ప్రధాని నరేంద్ర మోదీ క్లాస్ పీకినట్లు చెబుతున్నారు. కనీసం ప్రతిపక్ష పాత్ర కూడా పోషించలేక పోతున్నారని మోదీ అసంతృప్తి వ్యక్తం చేయడం వెనక ఆయనకు నిఘా వర్గాల నుంచి అందిన సమాచారం మేరకే ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలిసింది. బీజేపీ అధ్యక్షుడిగా కొన్నాళ్ల క్రితం రామచందర్ రావును నాయకత్వం నియమించింది. అయితే రామచందర్ రావుకు కూడా ఎంపీలు, ఎమ్మెల్యేలు సహకరించడం లేదని కేంద్ర నాయకత్వానికి అందుతున్న నివేదికలను బట్టి అర్థమవుతుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లోనూ పేలవమైన ప్రదర్శన చూపడం వెనక నేతల మధ్య సమన్వయం లేకపోవడమే కారణమని కేంద్ర నాయకత్వానికి స్పష్టంగా తెలుస్తుంది. పాత, కొత్త నేతల మధ్య అంతర్గత యుద్ధం జరుగుతున్నట్లు నాయకత్వం గుర్తించింది.తెలంగాణలో బీజేపీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయడానికి కేంద్ర నాయకత్వం సిద్ధమవుతున్నట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి అనేక అవకాశాలున్నప్పటకీ ఆ అవకాశాలను వినియోగించుకోక పోగా ప్రత్యర్థి పార్టీలకు కొందరు నేతలు అనుకూలంగా వ్యవహరిస్తున్న అనుమానం కూడా బీజేపీ అగ్రనేతల్లో వ్యక్తమవుతుంది. అందుకే మోదీ ఈ రకమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు సమాచారం. కేంద్రమంత్రులు ఇద్దరి మధ్య కూడా సమన్వయం లేకోవడాన్ని గుర్తించిన కేంద్ర నాయకత్వం, సరైన దిశలో పయనించేలా చర్యలు తీసుకునే అవకాశాలున్నాయని బీజేపీ సీనియర్ నేత ఒకరు తెలిపారు. త్వరలోనే బీజేపీ జాతీయ అధ్యక్షుడు తెలంగాణ నేతలతో సమావేశం ఏర్పాటు చేసి అందులో తమ అభిప్రాయాలను కుండబద్దలు కొడతారని సమాచారం.

# పి ఆర్ ఎస్ ఐ బెస్ట్ ఛాప్టర్ అవార్డు-2025ను అందుకున్న హైదరాబాద్ ఛాప్టర్

హైదరాబాద్, డిసెంబర్ 15(భారత శక్తి )పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ ఛాప్టర్ ప్రతిష్ఠాత్మక పిఆర్ఎస్ఐ బెస్ట్ ఛాప్టర్ అవార్డు%-%2025ను సొంతం చేసుకుంది.ఈ అవార్డును ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో డిసెంబర్ 13 నుంచి 15 వరకు నిర్వహించిన 47వ ఆల్ ఇండియా పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్ ముగింపు సభలో ఉత్తరాఖండ్ ప్రభుత్వ పార్లమెంటరీ వ్యవహారాలు మరియు అటవీ శాఖ మంత్రి సుబోధ్ ఉనియాల్ ప్రదానం చేశారు.



ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్ఐ హైదరాబాద్ ఛాప్టర్ చైర్మన్ డా. యాదగిరి కంభంపాటి, కార్యదర్శి కె. రాజేశ్‌తో పాటు ఛాప్టర్ సభ్యులు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును స్వీకరించారు.

మూడు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో దేశవ్యాప్తంగా సుమారు 25 పిఆర్ఎస్ఐ ఛాప్టర్ల నుంచి 300కు పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ కార్పొరేట్ పబ్లిక్ రిలేషన్స్ సంస్థలు కూడా ఈ కాన్ఫరెన్స్‌లో భాగస్వాములయ్యాయి.కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవానికి ఉత్తరాఖండ్ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే ఉత్తరాఖండ్ శాసనసభ స్పీకర్ శ్రీమతి రీతూ ఖండూరి భూషణ్, ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి రమేశ్ పోఖ్రియాల్ నిశాంక్‌తో పాటు పలువురు ప్రముఖులు పిఆర్ఎస్ఐ నిర్వహించిన సదస్సు, సమావేశాలలో పాల్గొన్నారు.

వరుసగా ఈ అవార్డును గెలుచుకున్న హైదరాబాద్ ఛాప్టర్‌ను పిఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడు డా. అజిత్ పాఠక్, జాతీయ ఉపాధ్యక్షుడు (దక్షిణ భారతం)యు .ఎన్. శర్మ, ప్రధాన కార్యదర్శి పి ఎల్ కే మూర్తి మరియు జాతీయ కమిటీ సభ్యులు హైదరాబాద్ చాప్టర్ వారిని అభినందించారు.




# బండి వర్సెస్ ఈటెల

కరీంనగర్, భారత శక్తి ప్రతినిధి,డిసెంబర్ 15:

కేంద్రమంత్రి బండిసంజయ్ వర్సెస్ ఈటల రాజేందర్. ఇది కొత్త ఎపిసోడేం కాదు. తెలంగాణ స్థానిక ఎన్నికలు రాబోతున్నాయన్న ప్రచారం స్టార్ట్ అయినప్పటి నుంచే ఇద్దరు నేతల మధ్య కోల్డ్ వార్ రచ్చకెక్కింది. నువ్వానేనా అన్నట్లుగా ఒకరిపై మరొకరు ఇండైరెక్ట్ కామెంట్స్‌తో హీటెక్కించారు. తన పార్లమెంట్ పరిధిలో తన అనుచరులే అభ్యర్థులుగా ఉంటారని సంజయ్..హుజురాబాద్ తన ఇలాకా..అక్కడ తన అనుచరులే బరిలో ఉంటారు..గెలిపించుకుని తీరుతానంటూ ఈటల హాట్ కామెంట్స్ చేసి చర్చకు తెరలేపారు.ఆ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేసింది. ఇలా ఫస్ట్ ఫేజ్ ఎన్నికలు పూర్తయ్యాయో లేదో..మరోసారి వార్ ఆఫ్ వర్డ్స్ హీటెక్కిస్తున్నాయి. స్వయంగా కేంద్రమంత్రి బండి సంజయ్ ఆఫీస్ నుంచి రిలీజ్ అయిన ఒక ప్రెస్ నోట్‌తో..పాత వివాదం కొత్త రచ్చకు దారితీసినట్లు అయింది. హుజురాబాద్ నియోజకవర్గం కమలాపూర్ మండలంలో బోణీ కొట్టిన బీజేపీ..బీజేపీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి ర్యాకం శ్రీనివాస్ 90 ఓట్లతో విజయం అంటూ కేంద్రమంత్రి బండిసంజయ్ ఆఫీస్ ప్రెస్ నోట్ రిలీజ్ చేసింది.వరకు ఓకే. కానీ ఈటల రాజేందర్ బలపర్చిన అభ్యర్థి ర్యాకం సంపత్ ఓటమి అంటూ ఆ పత్రికా ప్రకటనలో ఉండటమే రాద్ధాంతం అవుతోంది. ఈ ప్రెస్ నోట్ హుజురాబాద్ బీజేపీలోనే కాదు రాష్ట్ర పార్టీలోనూ చర్చనీయాంశంగా మారింది. బీజేపీ బలపరిచిన అభ్యర్థి గెలిచాడు అంటే సరిపోయేది..ఈటల రాజేందర్ బలపరిచిన అభ్యర్థి ఓడిపోయాడని పత్రిక ప్రకటన రిలీజ్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని చర్చించుకుంటున్నారట కొందరు నేతలు.బండి సంజయ్ ఆఫీస్ నుంచి విడుదలైన పత్రిక ప్రకటనపై పరోక్షంగా ఎంపీ ఈటల రాజేందర్ రియాక్ట్ అయ్యారు. మరింత మంట పుట్టించేలా..అవగాహన లేని వారు పెడుతున్న సోషల్ మీడియా పోస్టులపై పార్టీ చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ ఎన్నికలు ప్రజల్లో వారి వెనుకున్న నాయకుడు, పార్టీని చూసి అభ్యర్థులకు అండగా నిలుస్తున్నారు.గెలిచిన తర్వాత ఐదు లక్షలు 10 లక్షలు ఇస్తాం..మా పార్టీకి రండి..మా పార్టీలో గెలిచినట్టు చెప్పుకోండి అని చిల్లర ప్రయత్నం కొనసాగుతోందన్నారు. ఎన్నికల ముందే తమకు ఫలానా నాయకుడి ఆశీర్వాదం ఉందని చెప్తే మంచిది కానీ..గెలిచిన తర్వాత ఆయన వెనక..ఈయన వెనక పోతామంటే..ప్రజలు విశ్వసించే అవకాశం ఉండదంటూ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు కాక పుట్టిస్తున్నాయి. వర్గ విభేదాలు పక్కన పెట్టండి..తెలంగాణలో పార్టీ బలోపేతం కోసం కృషి చేయండి అంటూ..ప్రధాని మోదీ తెలంగాణ ఎంపీలపై ఆగ్రహం వ్యక్తం చేశారని ప్రచారం జరిగి రెండు రోజులు కూడా కాలేదు..అంతలోపే బండి, ఈటల ఎపిసోడ్‌లో పార్టీ క్యాడర్‌లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందట. స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పినా ఇద్దరు కీలక నేతల తీరు మారదా అంటూ గుసగుసలాడుకుంటున్నారట. రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్‌రావు కూడా బండి, ఈటల తీరుతో తల పట్టుకుంటున్నారట. ఇక అధిష్టానమే జోక్యం చేసుకుని ఇద్దరు నేతలకు సర్ధిచెప్పి..కలిసి పనిచేసేలా చేయాలని కోరుకుంటున్నారట నేతలు.

# జిల్లాలో సమగ్రంగా న్యూట్రిషనల్ కన్వర్జెన్స్ పైలెట్ ప్రాజెక్టు సర్వే.: జిల్లా కలెక్టర్ డా. శ్రీదర్ చెరుకూరి

కడప, డిసెంబర్ 15(భారత శక్తి) : సాంకేతిక మద్దతు ద్వారా పోషకాహారం-వ్యవసాయ కన్వర్జెన్స్‌ను ప్రారంభించడం(ENACTS)' అనే పైలెట్ ప్రాజెక్టు కార్యక్రమ సర్వే జిల్లాలో సమగ్రంగా సాగుతోందని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీదర్ చెరుకూరి పేర్కొన్నారు.మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యక్రమంలో.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జిల్లాలో.. అమలవుతున్న ENACTS పైలెట్ ప్రాజెక్ట్ సర్వే కార్యక్రమంపై ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ISB%) ప్రాజెక్ట్ అసోసియేట్ స్మృతితో పాటు సంబంధిత జిల్లా అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ISB, బిల్ & మెలిండా గేట్స్ ఫౌండేషన్ ద్వారా సమకూర్చే నిధులతో.. సాంకేతిక మద్దతు ద్వారా పోషకాలు అధికంగా ఉండే ఆహార పదార్థాల (NDFలు) లభ్యత, అందుబాటు మరియు పౌష్టిక సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ENACTS (సాంకేతిక మద్దతు ద్వారా పోషకాహారం-వ్యవసాయ కన్వర్జెన్స్‌ను ప్రారంభించడం) అనే పైలెట్ ప్రాజెక్టు జిల్లాలో సమగ్రంగా అమలు అమలు అవుతోందన్నారు. గ్రామాలన్నింటిలో పాలు, కూరగాయలు, ఇతర దిగుబడులను రైతులు పండించి.. మార్కెటింగ్ చేసి ఆదాయం పొందుతున్నారే తప్ప పౌష్టికాహారం ను వారు వినియోగించడం లేదన్నారు. ఈ కారణంగా గ్రామీణ స్తాయి పిల్లల్లో పౌష్టికాహార లోపం కారణంగా ఆరోగ్య సమస్యలు, అడపిల్లల్లో అనీమియా వంటి సమస్యలు ఎదురవుతున్నాయని ఐఎస్ బి సర్వే ద్వారా వెల్లడయినట్లు తెలిసిందన్నారు. ఈ న్యూట్రిషన్ కొరత కారణంగా ఎదురవుతున్న సమస్యలను గుర్తించి ఆ సమస్యలను అధిగమించేందుకు చేపట్టాల్సిన పరిష్కార మార్గాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఇందుకు గాను అనుబంధ శాఖల అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు.అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలోను, గర్భిణులు, బాలింతలకు అవసరమైన సంపూర్ణ పోషణకు అవసరమైన పోషక విలువలతో కూడిన ఆహార పంటల ఉత్పత్తిని పెంపొందించే దిశగా.. జిల్లాలో ఆయా శాఖలతో సమీక్షించి క్షేత్రస్థాయిలో.. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు, నగన్వాడీ కార్యకర్తలు తదితరులు ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యం అవుతున్నారన్నారు. ENACTSలో రాపిడ్ రెస్పాన్స్ రీసెర్చ్ అనే ప్రత్యేక విభాగం ఉందని, ఇది జిల్లా స్థాయిలో వ్యవసాయం-పోషకాహార కలయికను తెలియజేయడానికి, ఆయా రంగాలకు మద్దతు ఇవ్వడానికి సకాలంలో, డిమాండ్-ఆధారిత, స్థల-ఆధారిత పరిశోధనలను చేయడానికీ రూపొందించబడిందన్నారు.అందుకు అనువుగా.. వ్యవసాయం-పోషకాహార విలువల పెంపుదల కోసం



ప్రభావవంతమైన కార్యక్రమాలను రూపొందించడానికి, అందుకు తగిన వనరులను గుర్తించే ప్రాముఖ్యతను జిల్లా యంత్రాంగం గుర్తిస్తుందన్నారు. అందుకోసం స్వల్పకాలిక పరిశోధనను చేపట్టడడం జరిగిందని కార్యాచరణ, ఫలితాలు, విశ్లేషణ చేయుడానికీ ENACTS ప్రతినిధులకు సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, సవాళ్ళను, కొరతలను గుర్తించి వివరాలను అందివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రా నాయక్, డిప్యూటీ డిఎంహెచ్ఓ మహేశ్వర కుమార్, సీఎన్ఎఫ్ డిపిఎం ప్రవీణ్ కుమార్, ఐసిడిఎస్ పీడి రమాదేవి, ఉద్యాన శాఖ, సంబందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచులను సన్మానించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి,డిసెంబర్ 15:

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచిన నూతన సర్పంచులు సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచులను చింతా ప్రభాకర్ ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. గ్రామాభివృద్ధికి తన సంపూర్ణ సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపును కృషి చేసిన పార్టీ నాయకులు కార్యకర్తలు, కుటుంబ సభ్యులకు అభినందించారు. గత ప్రభుత్వంలో గ్రామపంచాయతీలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని గుర్తు చేశారు. కెసిఆర్ పాలనని ప్రజలు మళ్ళీ కోరుకుంటున్నారని పేర్కొన్నారు. హరిదాస్ మారేపల్లి తమ్ములబాయి తండా మారేపల్లి



మాచిరెడ్డిపల్లి చర్లగూడెం సర్పంచులు వార్డు సభ్యులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన రెండవ విడత పోలింగ్ ప్రక్రియ: జిల్లా కలెక్టర్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 15: 2వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా నిర్వహించిన ఎన్నికలలో పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్న వృద్ధ ఓటర్లతో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడారు. ఈ సందర్భంగా వృద్ధురాలితో మాట్లాడిన కలెక్టర్ ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వయస్సు, ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు తప్పనిసరిగా ఓటు వేయాలని, ముఖ్యంగా యువతతో పాటు వృద్ధులు కూడా చురుకుగా ఎన్నికలలో పాల్గొనడం ఎంతో అభినందనీయమని అన్నారు. అనంతరం మధ్యాహ్నం 2.00 గంటలకు ప్రారంభమైన కౌంటింగ్ కేంద్రాలు ఎల్లారెడ్డి నియోజక వర్గంలోని లక్ష్మాపూర్,



లింగంపేట మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను సందర్శించి కౌంటింగ్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. ఇందులో సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆర్డీఓ పార్థ నరసింహారెడ్డి, పోలింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కల్లూర్ గ్రామ సర్పంచ్‌గా పి. దశరథ్ టీఆర్ఎస్ పార్టీ తరపున ఘన విజయం.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 15 (భారత



శక్తి): నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని కల్లూర్ గ్రామ సర్పంచ్ గా పి. దశరథ్ గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతామని, కల్లూర్ గ్రామాన్ని అన్ని రంగాలలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## మూడవ దశలో మూడవ ర్యాండమైజేషన్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జనరల్ అబ్జర్వర్ సత్యనారాయణరెడ్డి సమక్షంలో పూర్తి

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 15: మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మూడవ ర్యాండమైజేషన్ కలెక్టరేట్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం జిల్లా పాలనాధికారి



ఆశిష్ సాంగ్వాన్, సాధారణ పరిశీలకులు సత్యనారాయణ రెడ్డి సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగామూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే బాన్సువాడ నియోజక వర్గంలోని 8 మండలాలు బాన్సువాడ, బిచ్కుంద, బీర్కూర్, డోంగ్లి, జుక్కల్, మద్నూర్, నస్రుల్లాబాద్ పెద్దకొడప్గల్ మండలాలకు సంబంధించినపోలింగ్ సిబ్బంది య్నొక్క మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్, జనరల్ అబ్సర్వర్ సమక్షంలో నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్ , సిపిఓ, రఘునందన్ ,ఎస్ఓ శివకుమార్ , జిల్లా పంచాయతీ అధికారి ,కంప్యూటర్ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

### -ఖమ్మం జర్నలిస్టులకు కేటాయించిన 23.02 ఎకరాల భూమిని తక్షణం అప్పగించాలి
### -సమస్యల సాధన కోసం ఐక్య ఉద్యమ కార్యాచరణకు సిద్ధం
### -టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా తృతీయ మహాసభలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మామిడి సోమయ్య

భారతశక్తి ప్రతినిధి, ఖమ్మం, డిసెంబర్ 15:

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అర్హత కలిగిన వర్కింగ్ జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాల సాధన కోసం ప్రభుత్వంతో రాజ్యాంగ బద్ధంగా పోరాడుతామని, అందుకు జర్నలిస్టులంతా ఐక్య కార్యాచరణకు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ ఎప్పటికీ జర్నలిస్టుల పక్షానే నిలుస్తుందనీ, పాలకుల పక్షం కాదని ఆయన స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, రక్షణే ధ్యేయంగా సమస్యలపై పోరాడుతుందని పేర్కొన్నారు.

ఆదివారం ఖమ్మంలోని సిటీ సెంట్రల్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా తృతీయ మహాసభ ఘనంగా జరిగింది. జిల్లా అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ టి. సంతోష్ చక్రవర్తి అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో మామిడి సోమయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా సంఘం బాధ్యులు, సభ్యులు సంఘ నియమ నిబంధనలకు లోబడి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, స్థానిక జర్నలిస్టుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వృత్తిలో నైపుణ్యత, పనిలో పట్టుదల, క్రమశిక్షణతో కర్తవ్యాలు నిర్వర్తించడం ద్వారా సంఘ ప్రతిష్టను మరింత పెంచాలని ఆయన కోరారు. సంఘాన్ని దెబ్బతీసేలా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తప్పులు చేసే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమవ్వకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా, మండల కేంద్రాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులపై కుటుంబ పోషణ భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత టీఆర్ఎస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యలను నిర్లక్ష్యం చేశాయని, అదే బాటలో ప్రస్తుత ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా 'పాత్రికేయుల పోరు యాత్ర' చేపట్టక తప్పదని హెచ్చరించారు. టీడబ్ల్యూజేఎఫ్ ఏ రాజకీయ పార్టీకి లేదా ఏ ఒక్క మీడియా సంస్థకు అనుబంధం కాదని, జర్నలిస్టులందరికీ చెందిన సంఘమని పునరుద్ఘాటించారు. భయపడకుండా ధైర్యంగా సమిష్టిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



ఈ మహాసభలో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) కార్యదర్శి పులిపలుపుల ఆనందం, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కో-కన్వీనర్లు వల్లాల జగన్, తన్నీరు శ్రీనివాస్, కుడితాడు బాపురావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వి.రాజేందర్, పాల్వాయి జానయ్య తదితరులు ప్రసంగించారు. ఖమ్మం జిల్లా ఫెడరేషన్ నాయకులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్, అంతోటి శ్రీనివాస్, వందనపు సామ్రాట్, లీగల్ అడ్వయిజర్ పసుపులేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా నూతన కమిటీ ఎన్నిక


ఖమ్మంలో జరిగిన తృతీయ మహాసభలో టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా టి. సంతోష్ చక్రవర్తి, కార్యదర్శిగా నానబాల రామకృష్ణ, కోశాధికారిగా అర్వపల్లి నగేష్, ఉపాధ్యక్షులుగా అంతోటి శ్రీనివాస్, మందడపు మనోహర్, వేల్పుల నాగేశ్వర రావు, సంయుక్త కార్యదర్శులుగా కొదుమూరి భద్రయ్య, కుంభం రవి కుమార్ లు ఎన్నికయ్యారు. అలాగే జిల్లా కార్యవర్గ సభ్యులుగా అమరబోయిన ఉపేందర్, కాసోజు శ్రీధర్, కప్పల మధు, కందబోయిన నాగకృష్ణ, వేములకొండ రమేష్, మల్లెల శిల్ప, నైని స్వాతి తదితరులు ఎన్నికయ్యారు. తెలంగాణ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టీబీజేఏ) జిల్లా అధ్యక్షుడిగా వందనపు సామ్రాట్ గుప్తా ఎన్నికయ్యారు.

టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభ తీర్మానాలు

తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఇస్తున్న పరిహారం మాదిరిగానే, మృతి చెందిన జర్నలిస్టులకు కూడా రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి తక్షణమే అమలు చేయాలని, జర్నలిస్టుల పిల్లలకు సాధారణ ప్రైవేట్ పాఠశాలల నుంచి ఇంటర్నేషనల్ పాఠశాలల వరకు ఉచిత విద్యా సదుపాయం కల్పించాలని కోరుతూ, మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. మూతపడిన ఇండిపెండెంట్ జర్నలిస్టుల సైట్‌ను వెంటనే తెరిపించి, గతంలో అర్హత పొందిన లిస్టులో ఉన్న జర్నలిస్టులందరికీ బేషరతుగా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు, ప్రైవేట్ హాస్పిటల్స్‌లో హెల్త్ కార్డులు పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టుల ఉద్యోగ భద్రత, భౌతిక భద్రతకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేసింది. అలాగే రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయాలని, అపరిష్కృతంగా ఉన్న ఇండ్లస్థలాల సమస్యను తక్షణమే పరిష్కరించి ప్రభుత్వంతో సత్వర చర్చలు చేపట్టాలని, జర్నలిస్టులకు న్యాయ రక్షణ సెల్ ఏర్పాటు చేయాలని, అన్ని కమిటీలలో మహిళా జర్నలిస్టులకు తగిన ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు విధి నిర్వహణలో ఉన్న మహిళా జర్నలిస్టులు రాత్రి వేళ ఇంటికి చేరుకునే సమయంలో రవాణా భద్రతను ప్రభుత్వం తప్పనిసరిగా కల్పించాలని ఈ మహాసభ గట్టిగా డిమాండ్ చేసింది.

# భారత ఆధ్యాత్మిక గురువు శ్రీరామకృష్ణ పరమహంస"

"విభిన్న మతాలు భగవంతుడిని చేరడానికి విభిన్న మార్గాలని అనుభవపూర్వకంగా మొట్ట మొదటి సారిగా ప్రపంచానికి చాటిచెప్పిన యోగి శ్రీరామకృష్ణ పరమహంస". రామకృష్ణపరమహంస ఒక యోగి, హిందూ ఆధ్యాత్మికగురువు మరియు తత్వవేత్త.



1836 వ సంవత్సరం , ఫిబ్రవరి 18 న పశ్చిమ బెంగాల్ లోని హుగ్లీ జిల్లాలో కామార్పుకూర్ అనే గ్రామంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు క్షుదీరామ్, చంద్రమణిదేవి దంపతులు. వీరు చాలా పేదబ్రాహ్మణులు. రామకృష్ణులకు తల్లిదండ్రులు పెట్టిన పేరు గదాధరుడు. బాల్యం నుండే ఇతనికి లలితకళలు, చిత్రలేఖనములో మంచి ప్రావీణ్యం ఉంది. అయితే చదువు మీద కానీ, ధన సంపాదన మీద కానీ ఆసక్తి చూపించేవాడు కాదు కానీ ఏకసంతాగ్రాహి. ప్రకృతిని ప్రేమిస్తూ, గ్రామం బయట పండ్ల తోటలలో స్నేహితులతో కలసి ఆట పాటలకు మాత్రమే సమయం ఇవ్వడం వల్ల చదువు పై ఆశక్తి తగ్గింది. వీరి గ్రామం నుండి వెళ్ళే సాధువులు,గ్రామంలో ఆగి ప్రసంగిచేటప్పుడు రామకృష్ణుడు ఎంతో శ్రద్ధగా వింటూ కొన్ని ప్రశ్నలు కూడా అడిగేవాడు. ఉపనయనము కాగానే బ్రాహ్మణునిగా మొదటి భిక్ష, ఒక శూద్ర యువతి దగ్గర పొందుతానని పట్టుపట్టి అప్పటి నియమాన్ని ఎదిరించి,తన జన్మకు మంత్రసాని గా వ్యవహరించి,తనని ప్రేమగా చూసుకున్న ధని అనే మహిళ నుండి ప్రథమ బిక్షను స్వీకరించాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగాలేక రాణీ రాషమొణి అనే ధనిక యువతి దక్షిణేశ్వర్ లో కట్టించిన కాళీ మాత గుడి లో మొదట దేవతను అలంకరించడానికి చేరి,తర్వాత పూజారి గా భాద్యతలు స్వీకరించాడు. గుడిలో ఉన్నది నిజంగా రాతి విగ్రహమేనా లేక సజీవమూర్తా,ఒకవేళ సజీవ దేవతను పూజిస్తే కనుక ఆ దేవత ఎందుకు నేనడిగిన ప్రశ్నలకు సమాధానము ఇవ్వడము లేదనే ప్రశ్నలతో సతమతమవుతూ రాత్రి, పగలనక కాళికా దేవిని ప్రత్యక్షము కమ్మని తీవ్రమైన మొరలతో ,పాటల రూపంలో, ఏడ్పుల రూపంలో, నవ్వుల రూపంలో మరియు ఆటల రూపంలో బిగ్గరగా పలుకుతూ నాట్యం చేయడం మొదలుపెట్టాడు. రామకృష్ణుడు దక్షిణేశ్వర్ లో అత్మజ్ఞాన అభ్యాసములతో పిచ్చివాడై పోయాడని పుకారు వచ్చింది. రామకృష్ణుని తల్లి ఆతనికి వివాహము చేస్తే బాగవుతాడని భావించి గదాదర్ తో మాట్లాడగా, వివాహమునకు అభ్యంతరము చెప్పక పోవడమే కాకుండా, మూడు మైళ్ళ దూరములో ఉన్న జయరాంబాటి గ్రామంలో రామచంద్ర ముఖర్జీ ఇంట్లో పెళ్ళికూతురు ఉందని చెప్పాడు. 5 ఏళ్ళ శారదా దేవితో ఆతని పెళ్ళి నిశ్చయమైనది. శారద రామకృష్ణుని మొదటి శిష్యురాలు. తాను గురువుల వద్ద నేర్చుకున్న విద్యలన్నీ ఆమెకు నేర్పారు. ఆమెను కూడా తనంతటి వారిగా తీర్చిదిద్దారుపెరుగుతున్న భారత జాతీయత పై రామకృష్ణుని ప్రభావము పరోక్షముగా ఉన్నపటికీ చాలా మంది జ్ఞానులు రామకృష్ణునితో నిత్యము సంభాషిస్తూ ఉండేవారు. అతనితో కొంతమంది మతపరమైన విషయాలలో ఏకీభవించనప్పటికీ చాలా గౌరవిస్తూ ఉండేవారు. ఆ తరువాత కొద్ది కాలములోనే రామకృష్ణ పరమహంసగా పిలవబడ్డాడు. తన అనుభవాలను ప్రపంచానికి చెప్పడానికి శిష్యులు రావడం ప్రారంభించారు. వీరికి ఎందరో శిష్యులు ఉన్నప్పటికీ వీరి పేరు ప్రపంచ ఖ్యాతి పొందడానికి దోహదం చేసినది మాత్రము స్వామి వివేకానందుడు. "మహాత్మా మీరు భగవంతున్ని చూసారా?" అని ప్రశ్నించి ఆశించిన సమాధానం పొందిన తర్వాతనే వివేకానందుడు శిష్యుడుగా చేరాడు. వీరి ద్వారా రామకృష్ణమిషన్ స్థాపించబడి నేటికీ ఎన్నో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తోంది. రామకృష్ణ పరమహంస కాలక్రమంలో క్యాన్సర్ వ్యాధితో బాధపడ్డారు. తన నివాసాన్ని ఆరోగ్యరీత్యా దక్షిణేశ్వరం నుండి కాశిపూర్ కు మార్చారు. అప్పుడు శిష్యులు అందరూ ఎంతో సేవచేశారు. చనిపోవడానికి మునుపు ఒకరోజు తన ఆధ్యాత్మిక శక్తులన్నిటినీ స్వామి వివేకానందునికి ధారపోసారు. 1886 ఆగష్టు 16న మహాసమాధిని పొందాడు. అయన వదిలి వెళ్ళిన పదహారు మంది శిష్య బృందానికి స్వామీ వివేకానంద సారథ్యము వహించాడు. వివేకానంద ఆ తరువాత తత్త్వవేత్త, ఉపన్యాసకుడుగా ప్రసిద్ధి పొందాడు. వివేకానంద రామకృష్ణుని ముఖ్య వారసుడిగా గుర్తింపబడి, రామకృష్ణుని సందేశాన్ని ప్రపంచమంతా వ్యాపింపచేసి, హిందూమతమును పశ్చిమదేశాలలో కూడా పరిచయము చేసాడు. జ్ఞానము ఐకమత్యానికి, అజ్ఞానము కలహాలకి దారి తీస్తాయని,మానవుడు ఆలోచనతోనే మనిషిగా మారినాక భగవంతుని దర్శించడము సాధ్యమని, శాశ్వతమైన వస్తువులకు క్షణికమైన వస్తువులకు తేడా గమనించే వివేకము కలిగి ఉండాలని, దేవుడు శ్రద్ధగా చేసే ప్రార్థనలను వింటాడాని,కామము, అసూయ దేవుని దర్శనానికి రెండు ముఖ్య శత్రువులను తన ప్రవచనాలలో భోదించేవాడు. అలాగే స్వామీ వివేకానందుని బోధనలలో చాలా భాగం శ్రీ రామకృష్ణ పరమహంస గారి,ఆలోచనలు మరియు ఆశయాలని ఎన్నో సందర్భంలో స్వామి వివేకానంద గారు తెలియపరిచారు. రామకృష్ణ పరమహంస మరణానంతరము శారదా దేవి ఆధ్యాత్మిక దీక్షలు ఇవ్వసాగారు."గమ్యం స్థిరంగా ఉండాలని, ప్రయత్నంలో రాజీ ఉండకూడదని, అప్పుడు మాత్రమే విజయం మనదవుతుందని" యువతకు మార్గనిర్దేశం చేసిన మహానుభావుడు శ్రీ రామకృష్ణ పరమహంస.

గడప రఘుపతిరావు

రాష్ట్రఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత 9963499282

## వార్డు మెంబర్లుగా గెలిచిన విశ్వబ్రాహ్మణులకు సత్కారం

ములుగు జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 15 (భారత శక్తి): గ్రామపంచాయతీ ఎన్నికలలో వార్డు మెంబర్లుగా గెలిచిన విశ్వబ్రాహ్మణులకు ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ములుగు మండల అధ్యక్షుడు కడివెండి వీరాచారి అధ్యక్షతన ములుగు, వెంకటాపూర్ మండలాలలో స్థానిక సంస్థల ఎన్నికల్లో లక్ష్మీదేవి పేట కడివెండి తిరుపతి,సర్వాపూర్ ఎర్రోజు నరేష్ వార్డుమెంబర్లుగా ఎన్నికైనందుకు వారిని శాలువాతో సత్కరించి అభినందించారు.

ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా అధ్యక్షుడు ఎల్కతుర్తి రాజన్న, శ్రీలమంతల నరసింహ చారి, శ్రీనివాస్, శ్రీధర్, జ్ఞానేష్, శంకర్, దేవేందర్, మహేష్, రవీంద్ర చారి, తదితరులు పాల్గొన్నారు.



# వీరెగావ్ తాండ గ్రామానికి సేవ చేస్తా ఆశీర్వదించండి : వీరెగావ్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి రాథోడ్ జ్ఞానేశ్వర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో,డిసెంబర్ 15 (భారత శక్తి): కుబీర్ మండలంలోని వీరెగావ్ తాండ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఈయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తూ గ్రామ అభివృద్ధికి తోడ్పడుతానని అన్నారు.అలాగే ప్రజల ఆశీస్సులు, సహకారంతో పాటు, మీ అమూల్యమైన కత్తెర గుర్తుకు ఓటు వేసి వీరెగావ్ గ్రామ సర్పంచ్ గా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మీ అమూల్యమైన ఓటు ను కత్తెర గుర్తుకే వేసి గెలిపించాలని కోరారు.సదా మీ సేవలో రాథోడ్ జ్ఞానేశ్వర్ వీరెగావ్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి మీ ఇంటి బిడ్డ గా వస్తున్నా, మీ కష్ట సుఖాలలో పాలు పంచు కుంటా, మీ సమస్యలే నా సమస్యగా భావిస్తా, అభివృద్ధి నా లక్ష్యం. మీ అమూల్యమైన కత్తెర గుర్తుకు ఓటు నాకు వేసి గెలిపిస్తే గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇస్తున్నాను అని అన్నారు.ఈనెల డిసెంబర్




17 న జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మీ అమూల్య మైన ఓటు కత్తే గుర్తుకు వేసి గెలిపిచాలి అని కోరారు.

# ఆశీర్వదించండి ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతా: కుభీర్ సర్పంచ్ అభ్యర్థి సమీనాఖానం ముజాహిద్ ఖాన్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 15 (భారత శక్తి) : కుభీర్ లో ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థి సమీనాఖానం ముజాహిదా?న్ గ్రామప్రజలు ఆశీర్వదించి రిమోట్ గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే కుభీర్ పంచాయతీని జిల్లాలోనే ఆదర్శ పంచా యతీగా తీర్చిదిద్దుతానని కాంగ్రెస్ పార్టీ నారాయణావుపాటిల్ వర్గం బల పరిచిన అభ్యర్థి సమీనాఖానం ముజాహిదాఖాన్ అన్నారు. ముఖ్యంగా గ్రామంలోని నయాబాదీ కాలనీలో ఇళ్లపై నుంచి వెళు న్న 11కేవీ విద్యుత్ లైన్ తొలగింపు, ప్రభుత్వ ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు, ప్రసవాలు, జరిగేలా స్థా యిని పెంచి 50పడకల ఆసుపత్రిగా మారుస్తానని, వర్షాకాలం శ్రీ విఠలేశ్వ రస్వామి ఆలయంలోకి వరద నీరు చేరుకుండా అందరితో చర్చించి ప్రత్యేక ప్రణాళికలతో చర్యలు చేపడతానని, రైతు సోదరులు ఎదుర్కొంటున్న వ్యవ సాయ అంతర్గత రహదారులను సమస్య పరిష్కరించి రైతులకు అండగా నిలుస్తానని, శ్మశాన వాటిక అభివృద్ధి చేసి కావాల్సిన వసతులు కల్పిస్తామన్నారు.

యువత కోసం మినీ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని,



గ్రామంలో మై నార్టీ సోదరుల కోసం షాదీఖానా నిర్మాణం చేపడతాని, కాంగ్రెస్ పార్టీ, ప్ర వేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందేలా కృషి చేస్తా నని అంటూ తమ ఎజెండాను ఓటర్లకు వివరిస్తూ తమ ప్రధాన అనుచరులు తో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తమ అమూల్యమైన ఓటు రిమోట్ గుర్తుకు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# మహేందర్ రెడ్డి నూతన క్రికెట్ అకాడమీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 15: సంగారెడ్డి జిల్లా పటాన్చెరువు నియోజకవర్గం, తెల్లాపూర్




జీహెచ్ఎంసీ పరిధిలో మహేందర్ రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన "వన్ ఛాంపియన్ క్రికెట్ అకాడమీ" ప్రారంభోత్సవ కార్యక్రమంలో సామాజిక సేవాకర్త, యువ నాయకుడు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అకాడమీ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, యువతలో క్రీడా ప్రతిభను వెలికితీయడంలో ఇలాంటి అకాడమీలు కీలక పాత్ర పోషిస్తాయని పృథ్వీరాజ్ పేర్కొన్నారు.

# భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మాలదారుల ఇరుముడి మహోత్సవం

మణుగూరు, డిసెంబర్ 15 (భారతశక్తి): మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ నీలకంఠేశ్వర స్వామివారి ఆలయ ఆవరణలో గల శివాలయం పీఠం సట్టు యాకయ్య గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారుల ఇరుముడి మహో త్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ముందుగా నిత్య పూజలో భాగంగా అగ్రగామి గణపతి, షణ్ముఖ, అలంకార ప్రియునికి అష్టోత్తర శత నామావళి నామాలతో యాకయ్య గురుస్వామి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కన్నె స్వాములతో మొదలుకొని గురుస్వాముల వరకు ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప మాలదారుల బంధుమిత్రులతో శివాలయం స్వామియే శరణం అయ్యప్ప అంటూ నామస్మరణంతో ఆలయం మారుమ్రోగింది. ఇరుముడి మహోత్సవాన్ని తిలకించేందుకు పట్టణ ప్రముఖులు, మణుగూరు ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పిండిగ వెంకట్, మార్త శ్రీనివాస్ హాజరై మాలదారులకు పూలమాలలు వేసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. శివాలయం పీఠం 50 రోజుల పాటు నియమ నిష్ఠలతో ఎంతో భక్తి శ్రద్ధలతో గురుస్వామి ఆధ్వర్యంలో 40 మంది అయ్యప్ప దీక్షలకు పూనుకొని మండల కాలం పూజలందుకున్నారు. ఇరుముడి కార్యక్రమం ముగిసిన అనంతరం మాలదారులు ఇరుముడిని నెత్తిన పెట్టుకొని శివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నెయ్యాభిషేక ప్రియుడిని దర్శించుకునేందుకు శబరిమల బయలుదేరారు. ఈ కార్యక్రమంలో



గురుస్వాములు మరెడ్ల విద్యాసాగర్ రెడ్డి, నూ తలపాటి నాగేశ్వరరావు, బోడ బాలాజీ, పెరు స్వాములు అనుమాండ్ల నరేంద్ర రెడ్డి, కనుకు రమేష్, గద, గంట, కత్తి, కన్నె స్వాములు తదితరులు పాల్గొన్నారు.

# బావుపేట ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా: గ్రామ నూతన సర్పంచ్ బత్తిని రవీందర్

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)డిసెంబర్15:

బావూపేట ను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానని, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని బావూపేట నూతన సర్పంచ్ బత్తిని రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో భాగంగా, ఈనెల 11వ తేదీన జరిగిన జరిగిన సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి బత్తిని రవీందర్ తన సమీప అభ్యర్థి పై 219 ఓట్లతో విజయం సాధించారు. సర్పంచ్ గా విజయం సాధించిన బత్తిని రవీందర్ ను కాంగ్రెస్ పార్టీ పెద్దలు, గ్రామస్తులు, పార్టీ నేతలు, నాయకులు, కుటుంబ సభ్యులు,



స్నేహితులు పెద్ద ఎత్తున తరలివచ్చి అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బావూపేట గ్రామ నూతన సర్పంచ్ బత్తిని రవీందర్ మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచి నిలబెట్టిన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు, నా గెలుపుకు పార్టీలకతీతంగా సహకరించిన గ్రామస్తులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సర్పంచ్ పదవి కాలంలో గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటానని, గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపరిచి, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే విధంగా కృషి చేస్తానని సర్పంచ్ రవీందర్ అన్నారు.

# రెండవ విడత ఎన్నికలు ప్రశాంతం

## కేంద్రాలల్లో బందోబస్తు తీరును పర్యవేక్షిస్తున్న కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం

కరీంనగర్, డిసెంబర్ 15(భారతశక్తి ప్రతినిధి):

రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న 05 మండలాల్లోని మానకొండూరు, కేశవపట్నం, తిమ్మాపూర్, గన్నేరువరం, చిగురుమామిడి లోని పోలింగ్ కేంద్రాలను సీపీ గౌస్ అలం ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ?ఎన్నికల నిర్వహణకు కేటాయించిన సిబ్బంది పనితీరును, పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని అధికారులకు, సిబ్బందికి సీపీ సూచించారు. ?ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలను తీసుకోవడం, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. ?రెండవదశ గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత



వాతావరణంలో ముగిసేలా పర్యవేక్షించడంలో కరీంనగర్ పోలీస్ యంత్రాంగం నిమగ్నమై ఉందని సీపీ ఈ సందర్భంగా తెలిపారు.

# ఇంటర్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభించిన బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్

## – దేశంలోని అన్ని ఐఐటీలకు చెందిన 2500 మంది విద్యార్థులు హాజరు
## – నాలుగు రోజులపాటు కొనసాగనున్న క్రీడలు

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 15:సంగారెడ్డి జిల్లా ఐఐటి హైదరాబాద్ కంది క్యాంపస్ లో 58 వ ఇంటర్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని బ్యాట్మెంటన్ స్టార్ సైనా నెహ్వాల్ ప్రారంభించారు. ఇందులోముఖ్య అతిథులుగా బ్యాట్మెంటన్ చీఫ్ పుల్లెల గోపీచంద్, ఐఐటి హైదరాబాద్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ బివిఆర్ మోహన్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సైనా నెహ్వాల్ మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని ఆమె పిలుపునిచ్చారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే నిరంతరం క్రీడలు ఆడాలన్నారు. అప్పుడే చదువుల్లోనూ రాణించగలుగుతారన్నారు. శారీరక ఆరోగ్యానికి పోషక ఆహారాన్ని తీసుకుంటేనే శరీరం దృఢంగా ఉ



ంటుందని అన్నారు.ఇష్టమైన క్రీడల్లో సామర్థ్యాలను పెంపొందించుకుంటూ రాష్ట్రం దేశం గర్వించదగ్గ వ్యక్తులుగా ముందుకెళ్లాలన్నారు. ఈ స్పోర్ట్స్ మీట్స్ లో దేశంలోని అన్ని ఐఐటీలకు చెందిన 2500 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభను కనబరచానున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. నాలుగు రోజుల పాటు సాగే స్పోర్ట్స్ మీట్లో ఇండోర్ అవుట్డోర్ గేమ్స్ నిర్వహించడం తోపాటు పోటీలలో నెగ్గిన వారికి బహుమతులు ప్రధానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటి ప్రొఫెసర్లు నిర్వాహకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ మ్యాథ్స్ ఒలంపియాడ్ టెస్ట్ కు అపూర్వ స్పందన

## 18450మంది విద్యార్థులు హజరు
## 22న మొదటి మూడు బహుమతులు అందజేత
## అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి

కరీంనగర్, డిసెంబర్ 15(భారతశక్తి ప్రతినిధి):గణితంలో విద్యార్థులకు మేధస్సు పెరిగి ప్రతిభకు వన్నె తెస్తుందని అల్ఫోర్స్



విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి అన్నారు. నగరంలోని వావిలాలపల్లి లోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన అల్ఫోర్స్ మాథ్స్ ఒలంపియాడ్ – 2025 టెస్ట్ ను ప్రారంభించారు. ముందుగా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి ఘనంగా పుష్పాంజలిలో నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ దేశం గర్వించదగ్గ గణిత శాస్త్రవేత్తని, ఆయన సేవలు చిరస్మరణీయం, చారిత్రాత్మకమని కొనియాడారు. చిన్నతనం నుండే గణిత శాస్త్రంలో మక్కువ పెంచుకొని అద్భుతాలు సృష్టించినటువంటి గొప్ప శాస్త్రవేత్త అని గుర్తుచేశారు. విద్యార్థులు వారిని స్ఫూర్తిగా తీసుకోవాలనీ, కనుగొన్నటువంటి పలు గణితంశాలను సమగ్రంగా విశ్లేషించాలని పెద్ద పోటీ పరీక్షలలో ఘన విజయాలను నమోదు చేయాలని ఆకాంక్షించారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల ఆరంభం నాటి నుండి శ్రీనివాస రామానుజన్ జ్ఞాపకార్థమై జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొనీ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం చక్కటి ప్రణాళికలతో తెలంగాణ వ్యాప్తంగా 3వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించడం జరిగినదని చెప్పారు. ఈ క్రమంలో నేడు నిర్వహించినటువంటి ఈ పరీక్షకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 18,450 విద్యార్థులు హాజరైనారని చెప్పారు. ఈ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ఉంటాయని, మొదటి 3 స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు 5000 వేలు, 3000 వేలు, 2000 వేల రూపాయల నగదు బహుమతులను ఇవ్వడంతో పాటు ప్రశంస పత్రాలను అతిథుల చేతుల మీదుగా ఈనెల 22వ తేదీన కరీంనగర్ లో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ- టెక్నో పాఠశాలలో ప్రధానం చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రతి సంవత్సరం నిర్వహింపబడే ఈ అతిపెద్ద గణిత పరీక్షకు అపూర్వ స్పందన లభించడం చాలా హర్షించదగ్గ విషయమని మరియు ప్రధానంగా వివిధ విద్యా సంస్థల వారు అందిస్తున్నటువంటి సహకారం చాలా ప్రశంసనీయమైనదని ధన్యవాదాలు తెలియజేశారు మరియు ప్రోత్సాహం అందిస్తున్న తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ లోని వివిధ ప్రాంతాల నుండి వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు. పరీక్ష నిర్వహణకు తోడ్పాటును అందించడమే కాకుండా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల యాజమాన్యానికి ప్రత్యేకంగా నరేందర్ రెడ్డి కి తల్లిదండ్రులు శుభాభినందనలు తెలియజేశారు.

# సిఎస్ఐ చర్చి జాతర మహోత్సవంలో పాల్గొన్న జగ్గారెడ్డి

సంగారెడ్డి,భారతశక్తి ప్రతినిధి, డిసెంబర్ 15:

సంగారెడ్డి పట్టణంలోని సిఎస్ఐ చర్చ్ లో ఏర్పాటుచేసిన జాతర మహోత్సవంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్తమస్ను పురస్కరించుకొని చర్చిలో పాస్టర్లు నిర్వహిస్తున్న జాతర మహోత్సవ



సందర్భంగా క్రైస్తవ మహిళలకు సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన చర్చి ఫాదర్ లతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తును స్తుతిస్తూ యువతి యువకులు గీతాలు ఆలపించారు. యేసు నామంతో సీఎస్ఐ చర్చి ప్రాంగణం మారుమోయిపోయింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బుంటేనే సంతోషంగా ఉంటామని అనుకోవద్దు అంటూనే మనశ్శాంతిగా ఉంటేనే సంతోషంగా ఉంటామన్నారు. సిఎస్ఐ చర్చి ప్రాంగణంలో మనశ్శాంతి ఉంటుందన్నారు. క్రైస్తవులకు అన్ని విధాల సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. సంగారెడ్డి సదాశివపేట జహీరాబాద్ ప్రాంతాలకు చెందిన క్రైస్తవులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో చర్చిలో ఫాదర్లు క్రైస్తవ మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# చొక్కా లేకుండా రజనీకాంత్ ఫైట్.. స్టంట్ మాస్టర్‌కు డైమండ్స్ ఆఫర్!





రజనీకాంత్ సూపర్‌హిట్ చిత్రాల్లో 'పడయప్ప' ఒకటి. 'నరసింహ' టైటిల్‌తో తెలుగు ప్రేక్షకులనూ విశేషంగా అలరించింది. రజనీకాంత్ పుట్టినరోజుని పురస్కరించుకొని ఈ మూవీని ఈనెల 12న రీ రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న స్టంట్ మాస్టర్ కనల్ కన్నన్ ఆసక్తికర విషయం చెప్పారు. ఈ సినిమా చివరిలో.. చొక్కా తీసేసి రజనీకాంత్ ఫైట్ చేశారనే సంగతి తెలిసిందే. దాన్ని తీసిన విధానానికి ఫిదా అయిన రజనీకాంత్.. 'నీకేం కావాలి? డైమండ్స్ ఓకేనా' అని తనను అడిగారంటూ కనల్ నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొన్నారు. తనకు వజ్రాలు సెట్ అవవని చెప్పి రుద్రాక్షను కోరినట్లు తెలిపారు. ఇతరులను రజనీకాంత్ ఎంతగా గౌరవిస్తారో చెప్పేందుకు ఇదో ఉదాహరణ అంటూ నటుడిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు స్టంట్ మాస్టర్ కనల్ కన్నన్. తాను షర్ట్ లేకుండా ఫైట్ సీన్‌లో నటిస్తానని ఈ సినిమా షూటింగ్ సమయంలోనే రజనీకాంత్ చెప్పారని కనల్ తెలిపారు. అయితే ఆ విషయంలో తానే సందేహించానన్నారు. "సర్.. షర్ట్ లేకుండా మీరు యాక్ట్ చేయడం ఓకేనా?' అని నేను అడిగాను. ఆ సమయంలో సినిమా నుంచి ఆ సీన్ తీసేయడం రజనీకాంత్‌కు పెద్ద విషయమేమీ కాదు. కానీ, ఆయన అలా చేయలేదు. అదీ ఆయన వ్యక్తిత్వం" అని కొనియాడారు. కె.ఎస్. రవికుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ యాక్షన్ డ్రామా మూవీ 1999 ఏప్రిల్ 10న విడుదలైంది.

## సినిమా

# స్వేచ్ఛకు గౌరవం



మెగాస్టార్ చిరంజీవి, అనిల్‌రావిపూడి కాంబినేషన్‌లో మన శంకర వరప్రసాద్‌గారు మూవీ రూపొందుతున్న విషయం తెలిసిందే. ఇందులో హీరోయిన్‌గా నయనతార నటిస్తుండగా.. ప్రత్యేక అతిథి పాత్రలో విక్టరీ వెంకటేశ్ సందడి చేయనున్నాడు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి 12న సంక్రాంతి కానుకగా రిలీజ్‌చేయనున్నట్లు ఇప్పటికే మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికే విడుదల చేసిన మీసాల పిల్ల, శశిరేఖ సాంగ్స్ ఆడియన్స్‌ని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ మూవీలో చిరు సహజ లుక్‌లో కనిపించనున్నాడు. ఇటీవల సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో అనిల్ రావిపూడి ఈ విషయాలు వెల్లడించాడు. ఈ సినిమా కోసం చిరంజీవి 'సాల్ట్ అండ్ పెప్పర్' లుక్‌ను ట్రై చేద్దామనే ఆలోచనతో దర్శకుడి వద్దకు వచ్చాడట. మెగాస్టార్ బయట ఎలా ఉంటాడో.. సినిమాల్లోనూ అలానే చూపించాలనే ఆలోచనతో అనిల్‌రావుపూడి నో చెప్పాడట. ప్రత్యేకంగా కొత్త లుక్ అవసరం లేదని చెప్పడంతో చిరు పాజిటివ్ గా తీసుకొని ఓకే చెప్పాడట. దీంతో దర్శకుడిగా తనకు ఇచ్చిన స్వేచ్ఛను గౌరవించాడని పేర్కొన్నాడు.

# పాలరాతి శిల్పంలా



టాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ గా ఎంట్రీ ఇచ్చి, షార్ట్‌టైంలోనే స్టార్ స్టేటస్‌అందుకున్న హీరోయిన్ శ్రీలీల. తన ఎనర్జిటిక్ స్టెప్పులు, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ తో కుర్రాళ్ల మనసు దోచుకున్న ఈ భామ, గ్లామర్ విషయంలోనూ ఏమాత్రం తగ్గట్లేదు. మోడ్రన్ డ్రెస్సుల్లో ట్రెండీగా, సంప్రదాయ దుస్తుల్లో మెరుస్తూ కనిపిస్తోంది. లేటెస్ట్ గా శ్రీలీల షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. క్రీమ్ కలర్ డిజైనర్ లెహంగాలో అచ్చం దేవకన్యలా మెరిసిపోతుంది. ఆ దుస్తులపై ఉన్న షైనింగ్, ఆమె చర్మానికి తగ్గట్టుగా బ్లెండ్ అయ్యి, ఒక పాలరాతి శిల్పంలా కనిపిస్తుంది. మెడలో హెవీ డైమండ్ సెట్, చెవులకు మ్యాచింగ్ ఇయర్ రింగ్స్, నుదుటిన పాపిట బిళ్లతో ధరించిన ఆభరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జడలో మల్లెపూలు పెట్టుకుని, వాటి సువాసనలు వెదజల్లుతున్నట్లుగా ఆమె ఇచ్చిన పోజులకు అభిమానులు ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం శ్రీలీల చేతిలో బడా ప్రాజెక్టులు ఉన్నాయి. ఇటీవలే ఓ స్పెషల్ సాంగ్ తో దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకుంది ఈ బ్యూటీ. తమిళంలో పరాశక్తి, తెలుగులో పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సరసన ఉస్తాద్ భగత్ సింగ్ మూవీలో నటిస్తుంది. ఇక బాలీవుడ్‌లోనూ ఆమె ఎంట్రీకి రంగం సిద్ధమైంది. అనురాగ్ బసు దర్శకత్వంలో కార్తీక్ ఆర్యన్ హీరోగా నటిస్తోన్న ఓ సినిమా ద్వారా శ్రీలీల బాలీవుడ్‌లో అడుగుపెట్టనుంది.



# పతంగ్ ట్రైలర్ రిలీజ్

పతంగుల పోటీ నేపథ్యంతో రూపొందుతున్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్' ట్రైలర్ విడుదలైంది. సినిమాటిక్ ఎలిమెంట్స్ అండ్ రిషన్ సినిమాస్ బ్యానర్‌పై విజయ్ శేఖర్ అన్నే, సంపత్, సురేష్ కొత్తింటి, నాని బండ్రెడ్డి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వం వహించిన ఈ సినిమాను ప్రముఖ నిర్మాత డి. సురేష్ బాబు సమర్పిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ.. కొత్తవాళ్లతో చేసిన సినిమా అయినప్పటికీ, క్వాలిటీ విషయంలో ఎలాంటి రాజీ లేదు. కలర్‌ఫుల్ విజువల్స్‌తో పాటు ఈ సినిమాకు కథే హీరో. సంగీత దర్శకుడు జోస్ జిమ్మి అందించిన పాటలు అద్భుతంగా ఉన్నాయి. పాటలు వింటూనే పాజిటివ్ వైబ్స్ వస్తాయి. సినిమా చూస్తున్నంత సేపు పతంగుల పోటీ ప్రేక్షకుల్లో ఉత్సుకతను పెంచుతుంది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఈ సినిమా తప్పకుండా అలరిస్తుందనే నమ్మకం మాకు ఉంది అని తెలిపారు. యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే వినూత్న కథాంశంతో రూపొందిన 'పతంగ్' ఈ డిసెంబర్‌లో థియేటర్లలో ఓ పండుగ వాతావరణాన్ని తీసుకొస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.మరి కొద్ది రోజులలో విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి.

# ఈ వారం థియేటర్‌లో వినోదాన్ని పంచే చిత్రాలివే..

## ఓటీటీలో సందడి వీటిదే!





''గుర్రం పాపిరెడ్డి' ఆద్యంతం మంచి నవ్వుల ప్రయాణంలా ఉంటుందంటున్నారు దర్శకుడు మురళీ మనోహర్. నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా రూపొందిన చిత్రమిది. వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ సంయుక్తంగా నిర్మించారు. బ్రహ్మానందం, యోగిబాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. డిసెంబరు 19న థియేటర్స్‌లో విడుదల కానుంది. పాతిపెట్టిన శవాన్ని తీసుకొచ్చేందుకు శ్రీశైలం అడవుల్లోకి వెళ్లిన ఓ గ్యాంగ్‌కి ఎలాంటి చిక్కులు ఎదురయ్యాయి? ఇంతకీ ఆ శవం ఎవరిది? దాంతో ఈ గ్యాంగ్‌కి పనేమిటి? తదితర అంశాలతో రూపొందిన చిత్రమిది.




రామ్ కిరణ్, మేఘ ఆకాష్ జంటగా ఉదయ్ శర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సఃకుటుంబానాం'. హెచ్.మహదేవ గౌడ్ నిర్మాత. రాజేంద్ర ప్రసాద్, బ్రహ్మానందం, సత్య తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. 'అందరూ మెచ్చే మంచి కుటుంబ కథాంశంతో రూపొందుతున్న చిత్రమిద'ని టీమ్ చెబుతోంది. డిసెంబరు 19న థియేటర్స్‌లో అలరించనుంది.




యావత్ సినీ ప్రపంచాన్ని విశేషంగా ఆకట్టుకున్న చిత్రం 'అవతార్'. ఈ ఫ్రాంచైజీలో ఇప్పటికే రెండు చిత్రాలు విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్నాయి. వీటికి కొనసాగింపుగా ఇప్పుడు 'అవతార్: ఫైర్ అండ్ యాష్' సిద్ధమైంది. తొలి రెండు చిత్రాలతో పోలిస్తే పార్ట్ 3 ఎంతో ఆసక్తిగా ఉంటుందని చిత్ర దర్శకుడు జేమ్స్ కామెరూన్ చెబుతున్నారు. డిసెంబరు 19న ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. భారతీయ భాషల్లో 'అవతార్3' అలరించనుంది. యాష్ ప్రపంచంలోని తెగలతోనూ జేక్ కుటుంబం పోరాటం చేస్తుందని ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది. మొదటి పార్ట్‌లో భూమి, రెండో భాగంలో సముద్రం, ఇక ఇప్పుడు చంద్రుడిపై జరిగే యుద్ధాన్ని చూపించబోతున్నారు.




రోహిత్ సహాని, అబిద్ భూషణ్, రియా కపూర్, మేఘనా రాజ్‌పుత్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'మిస్‌టీరియస్' . మహి కోమటిరెడ్డి దర్శకత్వం వహించారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం డిసెంబరు 19న విడుదల కానుంది.



# వాటిని వృథాగా పడేస్తున్నారా?

వంట చేసే క్రమంలో మనం ఎన్నో పదార్థాల్ని వృథాగా భావించి పడేస్తుంటాం. కానీ 'ఈ సృష్టిలో ఏదీ వ్యర్థం కాద'న్నట్లు.. వాటితోనూ ఏదో ఒక ఉపయోగం ఉంటుందంటున్నారు నిపుణులు. ఈ విషయాన్నిగ్రహిస్తే.. వంటింట్లో వ్యర్థంగా భావించే వివిధ పదార్థాల్ని సద్వినియోగం చేస్తూ పర్యావరణాన్ని సైతం కాపాడుకోవచ్చంటున్నారు.



* ఆకుకూరల ఆకుల్ని వేరు చేసి.. కాడల్ని పడేయడం మనలో చాలామంది చేసేదే! నిజానికి ఇం దులో ఫైబర్‌తో పాటు ఇతర పోషకాలు అమితంగా ఉంటాయట. కాబట్టి వీటిని వృథాగా పడేయకుండా.. బాగా శుభ్రం చేసి వెజిటబుల్ స్టాక్స్, సలాడ్స్, సూప్స్‌తో పాటు టాసింగ్‌గానూ వాడుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు.
* బ్రెడ్ మిగిలితే దానిని క్రష్ చేసుకొని బ్రెండ్ క్రంబ్స్ తయారుచేసుకోవచ్చు. వంటకాల్లో క్రిస్పీనెస్ కోసం ఈ క్రంబ్స్‌ని వాడుకోవచ్చు.. అలాగే దీనివల్ల రుచీ పెరుగుతుంది. అయితే ఇలా చేసేముందు ఎక్స్‌పైరీ తేదీని పరిశీలించడం అవసరం.
* బటర్‌ని ఉపయోగించుకున్నాక ఆ ప్యాకెట్స్/షీట్స్‌ని పడేస్తుంటారు చాలామంది. నిజానికి ఆ షీట్ లోపలి వైపు అంటుకున్న బటర్‌ని బేకింగ్ ట్రే గ్రీజులా వాడుకోవచ్చు.
* పుచ్చకాయ, తర్బూజా.. వంటి తొక్కల్ని పడేయడం సహజం. అయితే వాటిని బాగా శుభ్రం చేసి మురబ్బా, జామ్.. వంటివి తయారుచేసుకోవచ్చు.
* పేపర్ టవల్‌ని వాడుకున్నాక మిగిలిన రోల్స్‌ని పడేయకుండా.. వాటిని కేబుల్/వైర్ ఆర్గనైజర్‌గా వాడుకోవచ్చు. తద్వారా అది చిక్కులు పడకుండా ఉంటుంది.

# నాటి శాలువా... నేటి ర్యాప్!

మనకంటే స్వెటర్లు వేసుకోవడం అలవాటు కానీ... ఒకప్పుడు అమ్మలు, బామ్మలు మాత్రం శాలువా కప్పుకోవడానికే ఇష్టపడేవారు. ఇప్పటికీ ప్రయాణాలంటే చలివేళే కాదు... ఇతర సమయాల్లోనూ బయటికి వచ్చేవి అవే! కానీ తెలుసా... వీటికీ పెద్ద చరిత్రే ఉందేదని? వందల ఏళ్ల క్రితం హోదాకీ, రాచరికానికీ గుర్తుగా వీటిని భావించేవారు. ఎక్కువగా రాణులే వాడేవారు మరి. తరవాత్తరవాత ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌గా మారాయి. దీంతో ధనిక వర్గాలన్నింటికీ పరిచయం అయ్యాయి. కేవలం మన దేశానికే పరిమితం అవ్వలేదు... విదేశాల్లోనూ వీటికి ఆదరణ పెరిగింది. అంతా బాగానే ఉంది కానీ... ఇప్పడీ శాలువా సంగతెందుకు అన్న సందేహమొచ్చిందా? ఏమీలేదు. ఫ్యాషన్ ప్రపంచమంతా ఓ వృత్తంలో తిరుగుతుంది అన్న మాట వినే ఉంటారుగా! శాలూవా ఇందుకు మినహాయింపు కాదు. అయితే నేటి అమ్మాయిలు దాన్నే శాల్, ర్యాప్ అని స్టైల్‌గా పిలుచుకుంటున్నారు. కుర్తీ, టీషర్ట్, షర్ట్... దేనిమీదకైనా స్టైల్‌గా చుట్టేసుకుని వెళ్లిపోతున్నారు. సౌకర్యానికి నేటి తరం ఎంత ప్రాధాన్యం ఇస్తుందో మనకు తెలిసిందేగా! ఆడుతూ పాడుతూ, ఉరకలు వేస్తూ ఉండే అమ్మాయిలు చూడటానికి ఎంత స్టైల్‌గా ఉన్నా... పదే పదే వాళ్ల శాల్ లేదా ర్యాప్ భుజాల్ని జారి పడుతోంటే విసిగిపోరూ? అందుకే 'హ్యాండ్స్ ఫ్రీ శాల్', 'ర్యాప్ విత్ స్లీవ్స్' అంటూ వీటిని ఎంచుకుంటున్నారు. సింపుల్‌గా ఓ కోట్‌నే వేసుకున్నట్టు లేదూ? స్టైల్‌కి స్టైల్, వెచ్చదనానికి వెచ్చదనం, అన్నింటికన్నా సౌకర్యం! ఇంకేం 'కోజీ వేర్' అని తెగ ఇష్టపడి కొనుక్కుంటున్నారు. అసలే డిసెంబరు... పార్టీల మాసం. డ్యాన్స్, పార్టీ, ఆటలు ఏవైనా చలి ఇబ్బంది పెట్టొద్దంటే ఇలాంటిది ఒకటి కావాల్సిందే కదా! అందుకే వార్డ్‌రోబ్‌లో చోటిచ్చేస్తున్నారు. మీకూ ఇదొకటి అవసరమే అనిపిస్తోందా? ఇంకేం తెచ్చేసుకోండి మరి!









# బంగారు తీగ... గుత్తుల్లో వేలాడుతోంది..!

ఇల్లంతా పచ్చగా అల్లుకున్న తీగకు... అందంగా విచ్చుకున్న పూల గుత్తులు కిందకి వేలాడుతుంటే చూడ్డానికి భలేగా ఉంటుంది కదూ! వీటిని మీరూ పెంచుకోవాలనుకుంటున్నారా? అయితే, మీకోసమే ఈ జాగ్రత్తలు...

గోల్డెన్ కాస్కేడ్ క్రీపర్ శాస్త్రీయనామం పెట్రియోవిటెక్స్ బాంబూసెటోరం. దీన్ని తెలుగులో బంగారు లత అని కూడా పిలుస్తారట. ఈ మొక్క ఒక్కసారి పూస్తే బంగారు వర్షం కురిసినట్లే అనిపిస్తుంది మరి. ఈ మొక్క ఒకప్పుడు మలేసియా, థాయ్‌లాండ్, ఇండోనేషియా వంటి ఆగ్నేయాసియా దేశాల్లో విరివిగా కనిపించేది. కొన్నాళ్లుగా మన దగ్గరా వికసిస్తోంది. ఈ గోల్డెన్ కాస్కేడ్ క్రీపర్... వేగంగా పెరుగుతుంది. సుమారు ఇరవై నుంచి 25 అడుగుల ఎత్తువరకూ ఎగబాకి కిందకి వేలాడుతూ మురిపిస్తుంది. వీటి పూలు సుమారు 30-90సెం. మీల పొడవు వరకూ వేలాడతాయి. ఈ పూలు మొదట ఆకుపచ్చ రంగులో ఉండి తర్వాత పసుపు వర్ణంలోకి మారతాయి. పూర్తిగా వికసించాక కాస్త లేత కాషాయ ఛాయలోనూ కనిపిస్తాయి. ఈ పూలకు తేనెలాంటి సుగంధం ఉంటుంది. అందుకే, ఇవి సీతాకోకచిలుకలు, తేనెటీగల్ని ఎక్కువగా ఆకర్షిస్తాయి.

**సంరక్షణ ఎలాగంటే...**

మన దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ సులువుగా ఎదిగే తీగజాతి మొక్క ఇది. ఆరు నుంచి ఎనిమిది గంటల పాటు నేరుగా సోకే ఎండ అవసరం. నీడ ఎక్కువైతే పూత తగ్గుతుంది. నీరు నిలవని సారవంతమైన నేలల్లో ఇది చక్కగా పెరుగుతుంది. దీన్ని నాటుకునే మట్టిలో 30 శాతం కోకోపీట్, 20శాతం పేడ ఎరువు, పదిశాతం ఇసుక కలపాలి. ఈ గోల్డెన్ కాస్కేడ్‌ని నాటుకున్న మొదటి ఆరునెలలు రోజూ నీళ్లు పోయాలి. ఆ తర్వాత వారానికి రెండు మూడు సార్లు అందిస్తే చాలు. మొదలు చుట్టూ నీరు నిల్వకుండా చూసుకోవాలి. నెలకోసారి 19 1919 నిష్పత్తిలో ఎన్‌పీకే సమగ్ర ఎరువుని అందిస్తే పూలు బాగా విచ్చుకుంటాయి. పూలు పూయడం పూర్తయ్యాక తీగల్ని 30శాతం వరకూ కత్తిరిస్తే మళ్లీ గుబురుగా విచ్చుకుంటుంది. మరుసటి సీజన్‌లో ఎక్కువ పూలూ వస్తాయి. ఈ మొక్క చాలా గట్టిది. కానీ, అధిక తేమ వల్ల ఆకుముడత, వేరు కుళ్లు తెగులు వచ్చే ముప్పు ఎక్కువ. మిలీ బగ్, స్పైడర్ మైట్ వంటివీ కొన్నిసార్లు ఆశించొచ్చు. ఓ చెంచా వేపనూనెను లీటరు నీటిలో కలిపి స్ప్రే చేస్తే సరి. ఆరోగ్యంగా ఎదుగుతుంది.







# జోర్డాన్ చేరుకున్న మోదీ... 37 ఏళ్ల తర్వాత ఓ భారత ప్రధాని చరిత్రాత్మక పర్యటన!

జోర్డాన్, డిసెంబర్ 15 (భారత శక్తి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మూడు దేశాల విదేశీ పర్యటనను సోమవారం ప్రారంభించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన తొలి మజిలీగా జోర్డాన్‌లోని అమ్మాన్‌కు చేరుకున్నారు. విమానాశ్రయంలో జోర్డాన్ ప్రధాని జాఫర్ హసన్ స్వయంగా మోదీకి స్వాగతం పలికి ప్రత్యేక గౌరవం కల్పించారు. ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా జోర్డాన్ తర్వాత ఇథియోపియా, ఒమన్ దేశాలను సందర్శించనున్నారు. భారత్‌జోర్డాన్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ పర్యటనకు చారిత్రక ప్రాధాన్యత సంతరించుకుంది. 37 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత ప్రధాని ఒకరు జోర్డాన్‌లో పూర్తిస్థాయి ద్వైపాక్షిక పర్యటన చేపట్టడం ఇదే తొలిసారి. తన రెండు రోజుల పర్యటనలో ప్రధాని మోదీ.. జోర్డాన్ రాజు అబ్దుల్లా ఇబ్న్ అల్ హుస్సేన్‌తో సమావేశమై ద్వైపాక్షిక, ప్రాంతీయ అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు. అలాగే, ప్రధాని జాఫర్ హసన్, యువరాజు అల్ హుస్సేన్ బిన్ అబ్దుల్లాతోనూ భేటీ కానున్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో ఇరు దేశాలు పరస్పరం సహకరించుకుంటున్నాయి. ఇటీవల జరిగిన పహల్గాం ఉగ్రదాడిని జోర్డాన్ రాజు తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లో తిరస్కరించాలని స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు కూడా బలంగా ఉన్నాయి. జోర్డాన్‌కు భారత్ మూడో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి కాగా, ద్వైపాక్షిక వాణిజ్యం 2.8 బిలియన్ డాలర్లుగా ఉంది. ముఖ్యంగా, భారతదేశానికి అవసరమైన ఫాస్ఫేట్, పొటాష్ వంటి ఎరువుల సరఫరాలో జోర్డాన్ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అక్కడి ప్రవాస భారతీయులతో కూడా సమావేశం కానున్నారు. జోర్డాన్‌లో సుమారు 17,500 మంది భారతీయులు వివిధ రంగాల్లో పనిచేస్తున్నారు. ఇటీవల అమ్మాన్‌ముంబై మధ్య నేరుగా విమాన సర్వీసులు ప్రారంభం కావడం ఇరు దేశాల మధ్య రాకపోకలను సులభతరం చేసింది.

## ముంబైలో ఇద్దరు టెర్రరిస్టులను అరెస్టు చేసిన పంజాబ్ పోలీసులు

ముంబై, డిసెంబర్ 15 (భారత శక్తి): ముంబైలో గ్యాంగ్‌స్టర్ నుంచి ఉగ్రవాదులుగా మారిన ఇద్దరిని... పంజాబ్ పోలీసులు, కేంద్ర సంస్థల సమన్వయంతో అరెస్టు చేశారు. వారికి నిషేధిత ఉగ్రవాద సంస్థ బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ (బీకేఐ)తో సంబంధాలున్నట్లు గుర్తించామని, వారిని అరెస్టు చేశామని డీజీపీ గౌరవ్ యాదవ్ వెల్లడించారు. అరెస్టు చేసిన వారిని గురుదాస్‌పూర్‌లోని వెరోక్ నివాసి సాజన్ మాసిహ్, అమృత్‌సర్‌లోని లాహోరి గేట్ నివాసి సుఖ్‌దేవ్ కుమార్ అలియాస్ మునీష్ బేడీగా గుర్తించారు. నిందితులిద్దరికీ నేర చరిత్ర ఉందని డీజీపీ తెలిపారు. వీరిపై హత్య, హత్యాయత్నం, ఆయుధాలు, పేలుడు పదార్థాల సరఫరా సంబంధిత కేసులు బటాలా, అమృత్‌సర్‌లోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో నమోదైనట్లు వెల్లడించారు. నిందితులిద్దరికీ పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐతో సంబంధాలు ఉన్నట్లు తెలిపారు. నిందితులు దుబాయ్, అర్మేనియాతో సహా విదేశాల నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంజాబ్‌లోనూ ఉగ్రవాద కార్యకలాపాలకు సిద్ధమైనట్లు వెల్లడించారు. వారి అరెస్టు రాష్ట్ర పోలీసుల అతిపెద్ద విజయమని అభివర్ణించారు.



## 'నో హెల్మెట్ నో పెట్రోల్' నిబంధనను తీసుకురావడం మంచి ఆలోచన: సీఎం చంద్రబాబు

విజయవాడ, డిసెంబర్ 15 (భారత శక్తి): రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా తిరుపతి జిల్లా పోలీస్ శాఖ చేపట్టిన చర్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. ద్విచక్ర వాహనదారుల భద్రత కోసం 'నో హెల్మెట్ - నో పెట్రోల్' నిబంధనను తీసుకురావడం హర్షణీయమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజల ప్రాణాలను కాపాడే ఇలాంటి కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ నిబంధనపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు 700 మంది పోలీస్ సిబ్బందితో భారీ ఎత్తున హెల్మెట్ అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించడాన్ని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ ర్యాలీలో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు స్వయంగా పాల్గొనడం ద్వారా ప్రజలకు మంచి సందేశం ఇచ్చారని కొనియాడారు. ఉన్నతాధికారుల భాగస్వామ్యం సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపడంతో పాటు, ప్రజల్లో కూడా బాధ్యతను పెంచుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం ప్రభుత్వం తీసుకువచ్చే నిబంధనలు, సూచనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఉన్నతాధికారులకు సూచించారు.



## చైనా పార్టులు వద్దు.. రూ.5,000 కోట్లతో స్వదేశీ డ్రోన్ల కొనుగోలుకు ఆర్మీ సిద్ధం

చైనా, డిసెంబర్ 15: భారత సైన్యం తన సామర్థ్యాన్ని మరింత పెంచుకునే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో, సుమారు రూ.5,000 కోట్ల విలువైన పూర్తి దేశీయ డ్రోన్ల కొనుగోలుకు ఆర్డర్లు ఇచ్చేందుకు సిద్ధమైంది. శత్రు దేశాల నుంచి ఎదురయ్యే జామింగ్, స్పూఫింగ్ వంటి ఎలక్ట్రానిక్ యుద్ధ తంత్రాలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా ఈ డ్రోన్లను ప్రత్యేకంగా రూపొందించారు. గతంలో పాకిస్థాన్, ఉగ్రవాద సంస్థలపై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎదురైన సవాళ్లను దృష్టిలో ఉంచుకుని సైన్యం ఈ డ్రోన్ల కోసం కఠినమైన పరీక్షలు నిర్వహించింది. అత్యవసర కొనుగోలు నిబంధనల కింద ఈ ప్రక్రియను చేపడుతుండగా, కేవలం దేశీయ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు మాత్రమే అవకాశం కల్పించారు. ముఖ్యంగా, ఈ డ్రోన్లలో చైనాకు చెందిన విడిభాగాలు ఏమాత్రం ఉండకూడదనే నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నారు. ది ఎకనామిక్ టైమ్స్ కథనం ప్రకారం, సైన్యం మూడు రకాల అవసరాల కోసం ఈ డ్రోన్లను సమకూర్చుకోనుంది. వీటిలో తక్కువ దూరంలోని లక్ష్యాలను ఛేదించే కామికేజ్ లేదా లోయిటరింగ్ డ్రోన్లు, సుదూర లక్ష్యాలను గుర్తించి ధ్వంసం చేసి తిరిగి వెనక్కి రాగల ప్రెసిషన్ డ్రోన్లు, నిఘా కోసం ఉపయోగించే యూఏవీలు ఉన్నాయి. ఈ డ్రోన్ల ఎంపిక కోసం భారత సైన్యం ప్రత్యేకంగా ఒక ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ టెస్టింగ్ జోన్‌ను ఏర్పాటు చేసింది. ప్రయోగం మొదలైనప్పటి నుంచే తీవ్రమైన జామింగ్ పరిస్థితులను సృష్టించి వాటి పనితీరును పరీక్షించింది. అలాగే, ఎత్తయిన పర్వత ప్రాంతాల్లో కూడా ఇవి ఎంత సమర్థవంతంగా పనిచేస్తాయో పరిశీలించింది. ఈ పరీక్షల్లో ప్రభుత్వ రంగ సంస్థ అయిన మ్యూనిషన్స్ ఇండియా లిమిటెడ్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, సుమారు రూ.500 కోట్ల విలువైన లోయిటరింగ్ మ్యూనిషన్స్ కాంట్రాక్టును దక్కించుకుంది. ఈ భారీ కొనుగోలుతో భవిష్యత్ యుద్ధాల్లో భారత సైన్యం నిఘా, దాడి సామర్థ్యాలు గణనీయంగా పెరగనున్నాయి.

## రవీంద్ర భారతి ప్రాంగణంలో ఎస్పీ బాలు విగ్రహావిష్కరణ

హైదరాబాద్, డిసెంబర్ 15 (భారత శక్తి): హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ప్రాంగణంలో దివంగత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తదితరులు హాజరయ్యారు. 7.2 అడుగుల ఎత్తు ఉన్న బాలు కాంస్య విగ్రహాన్ని తూర్పు గోదావరి జిల్లాలో ప్రత్యేకంగా తయారు చేయించారు. విగ్రహావిష్కరణలో భాగంగా రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బాలసుబ్రహ్మణ్యంకు ఇష్టమైన 20 పాటలతో ఈరోజు సాయంత్రం 50 మందితో సంగీత విభావరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రవీంద్ర భారతిలో బాలు విగ్రహం ఏర్పాటుపై ప్రముఖ గాయని, ఆయన సోదరి ఎస్పీ శైలజ స్పందించారు. రవీంద్ర భారతిలో తన విగ్రహం పెట్టాలన్నది బాలసుబ్రహ్మణ్యం చివరి కోరిక అని వెల్లడించారు. తన విగ్రహాన్ని పెట్టాలని ఆర్కెస్ట్రా వారి వద్ద బాలు వ్యక్తం చేయగా, వారు అతనిని వారించారని అన్నారు. కానీ ఇప్పుడు ఆయన కోరిక నెరవేరిందని ఆమె అన్నారు. తెలుగును మరిచిపోవద్దని, క్రమశిక్షణగా ఉండాలని ఎస్పీ బాలు ఎప్పుడూ చెప్పేవారని అన్నారు.

## ఏపీలో హార్ట్‌ఫుల్‌నెస్ విస్తరణ.. దాజీతో సమాలోచనలు జరిపిన సీఎం

విజయవాడ, డిసెంబర్ 15 (భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రంగారెడ్డి జిల్లా చేగూరులోని ప్రఖ్యాత కన్హా శాంతి వనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ అధ్యక్షుడు కమలేశ్ డి పటేల్ (దాజీ) ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు, దాజీ ప్రత్యేకంగా సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ భేటీలో భాగంగా, ఆంధ్రప్రదేశ్‌లో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ కార్యాలయాన్ని ఏర్పాటు చేసే విషయంపై చంద్రబాబు దాజీతో సమాలోచనలు జరిపారు. కన్హా శాంతి వనంలో హార్ట్‌ఫుల్‌నెస్ చేపడుతున్న కార్యక్రమాల గురించి దాజీ సీఎంకు వివరించారు. ప్రకృతి పరిరక్షణ, పర్యావరణం, సుస్థిర వ్యవసాయం, ధ్యానం, యోగా శిక్షణ వంటి అంశాలపై జరుగుతున్న కృషిని ఆయన చంద్రబాబుకు తెలిపారు. శాంతి వనంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంలో 1400 ఎకరాల విస్తీర్ణంలో శ్రీరామచంద్ర మిషన్ ఈ శాంతి వనాన్ని అభివృద్ధి చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద మెడిటేషన్ సెంటర్‌గా ఇది గుర్తింపు పొందింది. 8 లక్షలకు పైగా వృక్ష జాతులతో జీవవైవిధ్య కేంద్రంగా పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఇక్కడి హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లీడర్‌షిప్ ద్వారా 'కౌశలం' పేరుతో యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు.

## ఢిల్లీని కమ్మేసిన దట్టమైన పొగమంచు.. 100 విమానాల రద్దు

ఢిల్లీ, డిసెంబర్ 15 (భారత శక్తి): దేశ రాజధాని ఢిల్లీని ఈరోజు ఉదయం దట్టమైన పొగమంచు కమ్మేసింది. వాయు కాలుష్యం 'తీవ్ర' స్థాయికి చేరడంతో నగరం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. గాలి నాణ్యత సూచీ ప్రమాదకర స్థాయికి పడిపోవడంతో దృశ్యమానత తగ్గింది. ఫలితంగా విమాన, రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ప్రకారం, ఇవాళ ఉదయం 6 గంటలకు ఢిల్లీలో వాయు నాణ్యత సూచీ 456గా నమోదైంది. ఇది ఈ సీజన్‌లోనే రెండో అత్యంత గరిష్ఠ స్థాయి. ఆదివారం ఏక్యూఐ 461గా నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అక్షర్‌ధామ్ వద్ద ఏక్యూఐ 493గా, బారాఖంబా రోడ్డులో 474గా నమోదైంది. కాలుష్యం కారణంగా ఏర్పడిన పొగమంచుతో ఢిల్లీ విమానాశ్రయంలో సుమారు 100 విమానాలు రద్దు కాగా, 300కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటు 90కి పైగా రైళ్లు 6 నుంచి 7 గంటల పాటు ఆలస్యంగా నడుస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ ఎయిర్‌పోర్ట్, ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి సంస్థలు ప్రయాణికులకు ప్రత్యేక సూచనలు జారీ చేశాయి. ప్రయాణానికి ముందు తమ విమాన సర్వీసుల వివరాలు తెలుసుకోవాలని కోరాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్ఏపీ) కింద అత్యంత కఠినమైన స్టేజ్ IV ఆంక్షలను అమలులోకి తెచ్చింది. దీని ప్రకారం ఢిల్లీఎన్‌సీఆర్ పరిధిలో అన్ని రకాల నిర్మాణ, కూల్చివేత పనులపై నిషేధం విధించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో 50 శాతం సిబ్బందికి వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశాలు జారీ అయ్యాయి. 10వ తరగతి మినహా మిగిలిన తరగతులకు హైబ్రిడ్ విధానంలో క్లాసులు నిర్వహించాలని పాఠశాలలను ఆదేశించారు. మరోవైపు భారత వాతావరణ శాఖ ఢిల్లీకి 'ఆరెంజ్' అలర్ట్ జారీ చేసింది.

## శబరిమలకు పోటెత్తిన భక్తులు.. 25 లక్షలు దాటిన యాత్రికుల సంఖ్య

కేరళ, డిసెంబర్ 15 (భారత శక్తి): శబరిమల అయ్యప్ప స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. ప్రస్తుత మండల యాత్రా సీజన్‌లో స్వామివారిని దర్శించుకున్న యాత్రికుల సంఖ్య ఇప్పటికే 25 లక్షలు దాటింది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల అని అధికారులు తెలిపారు. రద్దీ పెరిగినప్పటికీ, పటిష్ఠమైన ఏర్పాట్ల కారణంగా దర్శనాలు సజావుగా సాగుతున్నాయని శబరిమల చీఫ్ పోలీస్ కోఆర్డినేటర్, ఏడీజీపీ ఎస్. శ్రీజిత్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గతేడాది ఈ సమయానికి సుమారు 21 లక్షల మంది భక్తులు రాగా, ఈసారి ఆ సంఖ్య 25 లక్షలు దాటిందని ఆయన తెలిపారు. యాత్ర ప్రారంభమైన తొలి రోజుల్లో అధిక రద్దీ కనిపించినా, సకాలంలో తీసుకున్న చర్యలతో పరిస్థితిని అదుపులోకి తెచ్చామన్నారు. వర్చువల్ క్యూ పాసులలో కేటాయించిన తేదీల్లో కాకుండా వేరే రోజుల్లో భక్తులు రావడమే ప్రాథమికంగా రద్దీకి కారణమని ఆయన స్పష్టం చేశారు. కేటాయించిన తేదీల్లోనే వస్తే అందరికీ సౌకర్యవంతంగా దర్శనం లభిస్తుందని సూచించారు. ఈ సీజన్‌లో వారాంతాల్లో కంటే పనిదినాల్లోనే భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటోందని శ్రీజిత్ పేర్కొన్నారు. ఈ నెల చివరి నాటికి రద్దీ మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామన్నారు. పెరగనున్న భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని, అందరికీ సులభంగా దర్శనం కల్పించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయన తెలిపారు. కాగా, ఈ నెల 27న జరిగే మండల పూజతో దాదాపు రెండు నెలల పాటు సాగే వార్షిక యాత్రలో మొదటి దశ ముగియనుంది.

## అడ్డదారిలో గద్దెనెక్కిన కాంగ్రెస్ కు కాలం చెల్లిందని పల్లె ప్రజలు ఓటుతో తేల్చిచెప్పారు: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 15 (భారత శక్తి): రెండో దశ పంచాయతీ ఎన్నికల ఫలితాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అరాచక పాలనకు చెంపపెట్టు లాంటివని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అడ్డదారిలో గద్దెనెక్కిందని, ఇప్పుడు ఆ పార్టీకి రాష్ట్రంలో కాలం చెల్లిందని పల్లె ప్రజలు తమ ఓటు ద్వారా స్పష్టమైన తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. రెండో దశ పంచాయతీ ఎన్నికల్లో అద్వితీయ ఫలితాలు సాధించిన బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ... ప్రభుత్వ పెద్దలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనూ అధికార పార్టీ కోటలు బీటలు వారడం రాష్ట్రంలో మారుతున్న రాజకీయ ముఖచిత్రానికి నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో సైతం బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు సత్తా చాటారని, ఇందుకు కృషి చేసిన పార్టీ నేతలు, కార్యకర్తలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రేవంత్ రెడ్డి రెండేళ్ల పరిపాలనా వైఫల్యాలు, గ్యారెంటీల అమలులో చేసిన ఘోరమైన మోసాలే కాంగ్రెస్ పార్టీకి ఉరితాళ్లుగా మారాయని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఈ వైఫల్యాలే ఆ పార్టీని ప్రజాక్షేత్రంలో కూకటివేళ్లతో పెకిలిస్తున్నాయని ఉద్ఘాటించారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార పక్షం ఏకపక్షంగా విజయాలు సాధించిందని, కానీ నేడు కాంగ్రెస్ కనీసం సగం పంచాయతీలను కూడా గెలవలేకపోయిందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇది అధికార పార్టీపై పల్లెల్లో పెల్లుబుకుతున్న ప్రజాగ్రహానికి స్పష్టమైన సంకేతమని వివరించారు. పార్టీ గుర్తు లేని ఎన్నికల్లోనే పరిస్థితి ఇలా ఉంటే, ఇక పార్టీ గుర్తుపై జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఇంతకన్నా ఘోర పరాభవం తప్పదని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ అభయహస్తం కాదని, అదొక రిక్త హస్తమని రెండేళ్ల పాలనలోనే తేలిపోయిందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల నాటికి రేవంత్ అసమర్థ పాలనలో అధికార పార్టీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ కబంధ హస్తాల నుంచి తెలంగాణను విడిపించే పోరాటంలో తమకు అండగా నిలుస్తున్న ప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనాలు తెలుపుతున్నట్లు చెప్పారు. కష్టకాలంలో పార్టీ వెన్నంటి నిలిచిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, వారి ఉజ్వల రాజకీయ భవిష్యత్తుకు పార్టీ బంగారు బాటలు వేస్తుందని కేటీఆర్ హామీ ఇచ్చారు.

# పెరిగిన బంగారం రేటు... మోసపోయిన జ్యువెలరీ షోరూమ్ యజమాన్యం

ఎల్బీనగర్, డిసెంబర్ 15 (భారత శక్తి): బంగారం రేటు పెరిగిన నేపథ్యంలో జ్యువెలరీ షాప్ ఓనర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్న ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి ఆనంద్ జ్యువెలర్స్ యజమాని గంగా విజయ్ కుమార్, ఆయన కోడలు గంగా లావణ్య లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సరూర్‌నగర్ పోలీసులు తెలిపారు. సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్ఎన్ఎస్



జ్యువెలరీస్ గోల్డ్ బిజినెస్‌లో పార్ట్‌నర్లుగా ఉన్న గంగా విజయ్ కుమార్, గంగా లావణ్య తమ వాటాను మరో పార్ట్‌నర్ అల్లంపల్లి శ్రీనివాస్‌కు లీగల్‌గా అమ్ముకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించిన డబ్బులు తీసుకున్నప్పటికీ, ఇటీవల బంగారం రేటు పెరగడంతో డబ్బులు తిరిగి చెల్లిస్తామని, కానీ రిజిస్ట్రేషన్ చేయబోమంటూ ఆనంద్ జ్యువెలర్స్ ఓనర్ విజయ్ కుమార్ మరియు అతని కోడలు లావణ్య మొండికెత్తినట్లు ఆరోపణలు ఉన్నాయి.దీనితో బాధితుడు అల్లంపల్లి శ్రీనివాస్ సరూర్‌నగర్ పోలీసులను ఆశ్రయించగా, పోలీసులు ఆనంద్ జ్యువెలర్స్ ఓనర్ విజయ్ కుమార్ మరియు అతని కోడలు లావణ్యపై BNS చట్టం కింద 316(2), 318(4), 351(2) r/w 3(5) సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ సందర్భంగా బాధితుడు అల్లంపల్లి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ, పోలీసులు తనకు న్యాయం చేయాలని కోరారు.

## పొదర్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్లే గ్రౌండ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కళ్లెం నవజీవన్ రెడ్డి



ఎల్బీనగర్, డిసెంబర్ 15 (భారత శక్తి): హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి నేడు హయత్ నగర్‌లోని పొదర్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్లే గ్రౌండ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్లే గ్రౌండ్‌ను ప్రారంభించి విద్యార్థులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో కీలకమని అన్నారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ఉత్సాహం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. చిన్న వయస్సు నుంచే క్రీడలపై ఆసక్తి పెంచితే భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరచే అవకాశాలు ఉంటాయని తెలిపారు.ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా విద్యతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇస్తూ మౌలిక సదుపాయాలు కల్పించడం అభినందనీయమని చెప్పారు. పిల్లలు మొబైల్ ఫోన్లు, డిజిటల్ వ్యసనాలకు దూరంగా ఉండి ఆటపాటల ద్వారా ఆరోగ్యంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ డా. ప్రతిక్ష జోష్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## చందనం చెరువు అభివృద్ధి పనులు త్వరగతిన పూర్తి చెయ్యాలి

*** ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి.**

మీర్ పేట్, డిసెంబర్ 15 (భారత శక్తి): చందనం చెరువు పనులు త్వరగతిన పూర్తి చేయాలని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి అన్నారు.ఈ సందర్భంగా సోమవారం చందనం చెరువును సందర్శించి పలు విషయాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. అంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, 2021 వ సంవత్సరం లో చెరువు అభివృద్ధికి ప్రతి పాదనలు పంపగా ప్రస్తుతం 2కోట్ల 25లక్షలు మంజూరు అయినట్లు ఆమె తెలిపారు.మంజూరైన నిధుల ద్వారా చెరువు కట్ట లోపలి భాగం చుట్టూ రాళ్లతో కట్టి,బయట నుండి మున్సిపల్ డ్రైనేజీ నీళ్లు చెరువులకు రాకుండా కట్టుదిట్టం చేసే ప్రణాళిక,బాటసారులకు అనుకూల ఉండే విధంగా బాటలు తయారు చేయాలి.చెరువు



చుట్టూ పచ్చని చెట్లు నాటి ,వీధి దీపాలు అమర్చాలన్నారు. చెరువు చుట్టూ ఆహ్లాదకర వాతావరణాన్ని సృష్టించే విధంగా అభివృద్ధి పనులు త్వరగతిన పూర్తి చెయ్యాలని అధికారులను ఆదేశించామన్నారు.ఈ కార్యక్రమంలో మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు అర్కల భూపాల్ రెడ్డి, బొక్క రాజేందర్ రెడ్డి,పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి,సునీత,విజయలక్ష్మ, అంజయ్య, అనిల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ హైడ్రాతోనే సాధ్యం..

### ప్రజావాణికి 46 ఫిర్యాదులు

హైదరాబాద్, డిసెంబర్ 15 (భారత శక్తి): చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడి.. పర్యావరణానికి ఊతమివ్వడం హైడ్రాతోనే సాధ్యమని పలువురు పేర్కొన్నారు. చెరువులు, నాలాలను పరిరక్షించి అనుసంధానం చేయాలని అప్పుడే వరదలు లేని నగరం చూడగలమన్నారు. ఈ క్రమంలో చెరువులను పరిరక్షిస్తున్న హైడ్రా.. పార్కులను కూడా చేపట్టాలని పలువురు కోరారు. లే ఔట్లలో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేసి ప్రాణవాయువును అందించాలని పలువురు హైడ్రా ప్రజావాణిలో కోరారు. నివాసాల మధ్య కొద్ది మొత్తంలో ఉన్న ప్రభుత్వ స్థలాలకు కంచె వేసి.. పార్కులుగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. నిజాంపేటలోని తుర్క చెరువు కింద ఉన్న ప్రభుత్వ స్థలాలకు కంచెవేసి పార్కులుగా తీర్చిదిద్దాలని కోరారు. మేడ్చల్ జిల్లా కాప్రా మండలం చిన్న చెర్లపల్లిలోని వెంకట రెడ్డి కాలనీలో పార్కు స్థలం కబ్జాకు గురి అవుతోందని వెంటనే హైడ్రా జోక్యం చేసుకోవాలని కోరారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 46 ఫిర్యాదులందాయి. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ పరిశీలించి.. పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.

**ఫిర్యాదుల వివరాలు ఇలా..**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ మండలంలోని కండ్లకోయ విలేజ్‌లో కోర్టు భవనం, ట్రాఫిక్ పోలీసు స్టేషన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణానికి ఉద్దేశించిన ప్రభుత్వ భూమి ఇప్పుడు డంపింగ్ యార్డుగా మారిపోయింది. గుండ్ల



పోచంపల్లి మున్సిపాలిటీ వాళ్లే అక్కడ చెత్త వేసి తగులబెడుతున్నారు. దీంతో చుట్టుపక్కల ఉన్న కాలనీ, అపార్టుమెంట్ వాసులు నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని ఆసుపత్రుల నిర్వాహకులకు కూడా వ్యర్థాలు అక్కడే పడేస్తున్నారు. మా ప్రాంతాలన్నీ బోరు నీటి మీదే ఆధారపడాల్సి ఉంది.. భూగర్భజలాలు కలుషితమవ్వడమే కాకుండా.. దుర్గంధం, పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాం. ప్రభుత్వ కార్యాలయాలకు ఉద్దేశించిన స్థలాన్ని కాపాడి.. అక్కడ మంచి వాతావరణం ఏర్పడేలా చూడాలని స్థానికులు ప్రజావాణికి ఫిర్యాదు చేశారు. రామంతాపూర్ పెద్ద చెరువులో తమ ప్లాట్లు మునిగిపోయాయని.. తమకు భూమికి భూమి లేదా.. తగిన విధంగా నష్ట పరిహారం ఇప్పించాలని అక్కడి నివాసితులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 1958లో గ్రామపంచాయతీ లే ఔట్‌లో ప్లాట్లు తాము కొనుక్కున్నామని.. అదే లే ఔట్‌లో కొంతమంది ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్నారని.. తమ ప్లాట్లు మాత్రం నీట మునిగాయని వాపోయారు. చెరువుకు బండ్ నిర్మించినప్పుడు కూడా కొన్ని ప్లాట్ల యజమానులకు నష్టపరిహారం ఇస్తామన్నారు. ఇప్పటికీ ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. చెరువులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తే.. తాము అడ్డు చెప్పమని.. తమ ప్లాట్లకు తగిన విధంగా నష్టపరిహారం చెల్లించే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం కురుములగూడ జన్నారం కాలనీలో రాజీవ్ గృహకల్ప పేరుతో 16 బ్లాకులు నిర్మించారు. వందలాది ప్లాట్లు ఉన్నాయి. ఇక్కడ కింద ఉన్న వారు.. అపార్టుమెంట్ల ముందు, వెనుక పార్కింగ్ కోసం ఉద్దేశించిన స్థలాలను కలిపేసుకుని కొన్ని చోట్ల దుకాణాలు నిర్మించుకోగా.. మరి కొంతమంది అదనంగా గదులు నిర్మించుకుని కిరాయిలకు ఇచ్చుకుంటున్నారని.. దీంతో తమకు పార్కింగ్ సౌకర్యం లేకుండా పోవడమే కాకుండా.. రాకపోకలకు కూడా ఇబ్బందిగా పరిణమించిందని వాపోయారు. వెంటనే ఆ స్థలాలను ఖాళీ చేయించాలని అక్కడి నివాసితులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

## కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



*** మాజీ మేయర్ చిగిరింత పారిజాత**

బడంగ్ పేట్, డిసెంబర్ 15 (భారత శక్తి): రాష్ట్రంలో జరుగుతున్న మూడో విడత స్థానిక సంస్థలలో భాగంగా మహేశ్వరం, కందుకూరు మండలాల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరిన మాజీ మేయర్. పదేళ్ల పాటు ప్రజలను పట్టించుకోకుండా కేవలం తమ అభివృద్ధిని మాత్రమే చూసుకున్న బిఆర్ఎస్ పార్టీకి ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ఈనెల 17న జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో నిలిచిన అభ్యర్థులను భారీ మేజార్టీతో గెలిపించాలని కోరారు. తొలివిడత, రెండో విడతలో రాష్ట్రవ్యాప్తంగా హస్తం పార్టీదే హవా కొనసాగగా ఎన్నిక కాబడిన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మన మహేశ్వరం నియోజకవర్గ ప్రజలు కూడా చైతన్యంతో ఆలోచించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు తమ అమూల్యమైన ఓటు వేయాలని కోరారు.ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఉచిత బస్సు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం, రైతు రుణమాఫీ, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చిన ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని నియోజక వర్గ ప్రజలను కోరారు.

## మునగపాటి నవీన్‌ను గెలిపించాలని కోరిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, డిసెంబర్ 15 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం మండలంలోని పిఎస్స్వి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి పి. సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహేశ్వరం గ్రామానికి సర్పంచ్ అభ్యర్థిగా మునగపాటి నవీన్‌ను ప్రకటిస్తున్నట్లు తెలిపారు. మునగపాటి నవీన్ సుప్రసిద్ధుడు, గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసే వ్యక్తి అని పేర్కొన్నారు.ఇలాంటి అర్హత కలిగిన అభ్యర్థి మీ గ్రామంలో ఉండటం గర్వకారణమని అన్నారు.రాబోయే ఎన్నికల్లో బ్యాట్ గుర్తుకు ఓటు వేసి, మునగపాటి నవీన్‌తో పాటు 14 మంది వార్డు సభ్యులను గెలిపించి, మహేశ్వరం గ్రామ అభివృద్ధికి బాటలు వేయాలని ఎమ్మెల్యే సబితా



ఇంద్రారెడ్డి ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం గ్రామానికి చెందిన పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## యూరియా బుకింగ్ కోసం యాప్

**: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

హైదరాబాద్, డిసెంబర్ 15 (భారత శక్తి): గత ఖరీఫ్ సీజన్లో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదురైన సంగతి తెలిసిందే. ఆ ఇబ్బందుల దృష్ట్యా రైతులకు యూరియా సరఫరా కోసం ప్రభుత్వం నూతన విధానం తీసుకు వచ్చింది. రైతులు ఎరువుల దుకాణాల ముందు క్యూ కట్టాల్సిన పని లేకుండా ఇంటి నుంచే యూరియా బుక్ చేసుకునేందుకు త్వరలో మొబైల్ యాప్ విడుదల చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రస్తుత యాసంగికి సరిపడా యూరియాను అన్నదాతలకు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఇప్పటికే 2.48 లక్షల టన్నుల ఎరువులు అందుబాటులో ఉండగా... కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ నెలకు కేటాయించిన యూరియా కూడా త్వరలోనే రాష్ట్రానికి చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.